



అన్నదాత కష్టంతో 'బంతా'ట!

దిగజారిన పూల ధర

కడుపు మండి పారబోసిన కర్షకుడు

కర్షకుల కష్టంతో ధరలు 'బంతా'ట ఆడుతున్నాయి. మార్కెట్‌లో అడిగేవారు లేకపోవడంతో కోసిన పూలను ట్రాక్టర్లతో తోటల నుంచి బయటకు తీసుకొచ్చి రోడ్డు పక్కన పారబోస్తున్నారు. ధర లేకపోవడంతో కలువాయి మండలం కొలవపల్లిలో బుధవారం నాలుగు ట్రాక్టర్ల బంతిపూలను నేలపాలు చేశారు. వినాయకచవితి పండుగ సమయంలో కేజీ రూ.50 నుంచి 60 పలికిన పూలు ఇప్పుడు రూ.5లకు దిగజారింది. ఆ రేటుకు కూడా మార్కెట్‌లో వ్యాపారులు అడగని పరిస్థితి. దీంతో రైతులు కూలీల ద్వారా పూలను కోసి రోడ్డు పక్కన పారబోస్తున్నరు. కోతకు వచ్చిన పూలను కోస్తేనే తరువాత కోతలు వస్తాయని, వదిలేస్తే పైరు దెబ్బతింటుందని రైతులు తెలిపారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి తీరా పూల దిగుబడి వచ్చే సమయానికి మార్కెట్‌లో రేటు పతనం కావడం తమను కోలుకోలేని దెబ్బతీసిందని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

కోతలు మొదలైనా

ఒక్క ప్రభుత్వ కొనుగోలు కేంద్రమూ లేదు! అనుమతుల పేరుతో చేతులెత్తేసిన యంత్రాంగం

తూకాలు ఏవీ!?

- భారీగా తగ్గిపోయిన ధాన్యం ధరలు
- పుట్టి ధాన్యం రూ.17 వేలకు మించని పరిస్థితి
- ఒక్కో పుట్టికి రూ.3-4 వేలు నష్టపోతున్న రైతులు

ఇందుకూరుపేట మండలం జంగందొరువు గ్రామానికి చెందిన రైతు పోతురాజు రమేష్ 13 ఎకరాల్లో సన్నాలు రకం సాగు చేశారు. ఎకరాకు రెండున్నర పుట్ల ధాన్యం దిగుబడి వచ్చింది. మద్దతు ధరకు అమ్ముకుందామంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేవు. దీంతో ఒక్కో పుట్టిని రూ.16 వేలకు దళారులు కొనుగోలు చేశారు. గత సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పుట్టి రూ.20 వేలు చొప్పున అమ్ముకోగా, ఈ దఫా ఒక్కో పుట్టికి రూ.4 వేలు నష్టపోవాల్సి వచ్చిందని రైతు రమేష్ వాపోయారు.

అల్లూరుకు చెందిన మరో రైతు పవన్‌కుమార్ తనకున్న ఐదెకరాల్లో రెండో పంట సాగు చేశారు. మార్కెట్లో దళారులు సిండికేట్‌గా మారి పుట్టి ధాన్యాన్ని రూ.17 వేలకు మించి కొనుగోలు చేయలేదు. నిల్వ చేసుకునే అవకాశం లేక తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్మేశారు. కనీస మద్దతు ధర కూడా దొరకడం లేదని వాపోయారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు దోచుకుంటున్నారని రైతు పవన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



అల్లూరులో ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

వీరే కాదు.. దాదాపు రెండో పంట సాగు చేసిన అందరి రైతుల పరిస్థితీ ఇదే. గతేడాది ప్రభుత్వం ముందుచూపుతో సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటిని జాగ్రత్త చేయడంతో ఈదఫా రికార్డు స్థాయి విస్తీర్ణంలో రెండో పంట సాగు జరిగింది. అయితే ఎడగారులో కూడా పంట వేసుకున్నామన్న సంతోషం రైతులకు చివరి వరకూ మిగిలకుండానే పోతోంది. అందుకు ప్రధాన కారణం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడమే. వరి కోతలు ప్రారంభమై రెండు వారాలు గడిచినా ఇంత వరకు ఒక కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు. ఈ నెలాఖరుకు కోతలు పూర్తవుతాయి. అయితే అధికారుల తీరు చూస్తుంటే ఈదఫా అసలు గింజ ధాన్యం కొనకుండానే మమ అనిపించేద్దాం అన్న ధోరణి కనిపిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. కోతలకు వారం ముందు నుంచే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వాటిపై రైతులకు అవగాహన కల్పించాల్సింది పోయి ఇప్పటికీ ఆ ఊసే ఎత్తకపోతుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ ప్రభావం రైతాంగంపై పడుతోంది. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులంతా సిండికేట్‌గా మారి అమాంతం ధరలు తగ్గించేస్తున్నారు. కనీసం పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేకపోవడం రైతాంగాన్ని తీవ్రంగా కలచి వేస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర పుట్టి ధాన్యానికి రూ.19720 ఉండగా, ప్రస్తుతం మార్కెట్లో గరిష్ఠంగా రూ.17 వేలకు మించి కొనుగోలు చేయడం లేదని రైతుల ద్వారా తెలుస్తోంది. కొన్నిచోట్ల రూ.16 వేలకే కొంటున్నారు. ఇలా ఒక్కో పుట్టికి రైతు రూ.3 వేల నుంచి 4 వేల వరకూ నష్టపోతున్నారు.

ఎవరికీ పట్టదా!?

ఈ ఏడాది రెండో పంట కింద దాదాపు మూడు లక్షల ఎకరాల్లో సాగు జరగ్గా, 7 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. అందులో మూడు లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు తగ్గట్టుగా చర్యలు మాత్రం తీసుకోలేకపోయారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి చేతులెత్తేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోతే మార్కెట్లో దళారులు ధర తగ్గించేస్తారన్నది బహిరంగ రహస్యం. అయినా ముందుగా అప్రమత్తం కాలేకపోయారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు కూడా జోక్యం చేసుకోకపోవడం గమనార్హం. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ధాన్యం ధరలు మరింత పడిపోయే ప్రమాదం ఉంది.

అన్నదాతలో అల'జడి'!

- వర్షానికి తడిసిన ధాన్యం
- కాపాడుకునేందుకు అవస్థలు

దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాపై ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి అడపాదడపా కురిసిన వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అయితే, ఈ వర్షం రైతులకు మాత్రం కష్టాలను తెచ్చి పెడుతోంది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు, కోసి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యాయి. బుచ్చి పరిసర ప్రాంతంలో సాయంత్రం 4 గంటల నుంచే ఆకాశం మేఘావృతం అవుతుండటంతో రైతులు అప్రమత్తమై ధాన్యం రాశులపై పట్టలు కప్పుకుంటూ కనిపించారు. ధాన్యాన్ని కింద పోయలేక వరికోత యంత్రం, ట్రాక్టర్లలోనే భద్రపరుచుకున్నారు. ఏపుగా పెరిగిన వరిపైరు తడితో బరువై భూమిమీద వాలిపోయింది. పరిస్థితి ఇలాగే ఉంటే మిల్లర్లను ఆశ్రయించి అడిగినకాడికి అమ్ముకోక తప్పలేదు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)



పెనుబల్లి వద్ద నేలవాలిన వరిపైరు



జొన్నవాడ వద్ద ధాన్యం అమ్ముకుంటున్న సమయంలో వర్షం రావడంతో రాశులపై పట్టలు కప్పిన రైతులు

కదిలొచ్చిన పోలేరమ్మ!

- వైభవంగా అమ్మవారి ఉత్సవ ఊరేగింపు
- నేటి వెంకటగిరి జాతరకు సర్వం సిద్ధం



పుట్టినిళ్ల కుమ్మరి ఇంటి వద్ద భక్తులకు దర్శనం కల్పిస్తున్న పోలేరమ్మ అమ్మవారు

వెంకటగిరి/వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుట్టిల్లయిన కుమ్మరి ఇంట బుధవారం రాత్రి రూపుదిద్దుకున్న పోలేరమ్మ ఊరేగింపుగా కదిలొచ్చారు. జాతర సందర్భంగా గురువారం భక్తులకు దర్శనం ఇవ్వడానికి ఆలయం వద్ద కొలువు దీరనున్నారు. వెంకటగిరి జాతరలో భాగంగా బుధవారం పోలేరమ్మ పుట్టినింట అమ్మవారి పీఠానికి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి 7.30 గంటలకు పీఠంపై అమ్మవారి ప్రతిమను (కళ్లు, దిష్టి చుక్క లేకుండా) తయారు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పుట్టినింట కొలువుదీరిన అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి 12 గంటలకు సప్పరంపై అమ్మవారిని అధిష్ఠింపచేసి అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలింటకు తీసుకొచ్చారు. ఇక్కడ ఆచార సంప్రదాయాలతో అమ్మవారికి కళ్లు, దిష్టి చుక్క ఏర్పాటు చేసి పూర్తి అలంకారం చేశారు. అక్కడ్నుంచి దివిటీల వెలుగుల్లో ఆసాదుల తప్పెట్లు, యువత చిందులు, కేరింతల నడుమ అమ్మవారి ఊరేగింపు మొదలైంది. ప్రతి ఇంటి ముంగిట అమ్మవారికి కోళ్లు, మేకలను బలిచ్చారు. దీంతో పట్టణంలోని రోడ్లు ఎర్రగా మారాయి. అలా.. ఊరేగింపుగా అమ్మవారం గురువారం తెల్లవారుజామునకు ఆలయం వద్ద వేప మండలతో వేసిన మండపంలో కొలువుదీరనున్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ సందర్భంగా వేయి కళ్ల దుత్తలతో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. ఆ తర్వాత ట్రాక్టర్‌పై అమ్మవారిని ఊరేగింపుగా విరూప మండపానికి తీసుకెళ్లి ప్రతిమను ముక్కలు ముక్కలుగా చేయడంతో వెంకటగిరి జాతర ముగియనుంది. జాతర సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

నేపాల్‌లో చిక్కుకున్నారా!? అయితే, వివరాలు తెలపండి!

- క్యూఆర్ కోడ్ ద్వారా సహాయక చర్యలు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని యుద్ధ ప్రాతిపదికన సురక్షితంగా తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతోందని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేక విమానాల ద్వారా తెలుగువారిని రాష్ట్రానికి సురక్షితంగా తీసుకురానున్నట్లు తెలిపారు. జిల్లావాసులు ఎవరైనా నేపాల్‌లో ఉంటే వారి వివరాలను క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకుంటే సహాయ సహకారాలు అందించేందుకు అవకాశం ఉంటుందని వెల్లడించారు.

చిరుత కలకలం

కలువాయి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోపుగుంట- కండాపురం మధ్యలో ఓ చిరుత సంచారం కలకలం రేపింది. స్థానికల కథనం మేరకు.. పర్లకొండ గ్రామానికి చెందిన పూలే పెంచలయ్య కలువాయిలోని ఎస్‌బీఐలో పని చేస్తున్నారు. కలువాయిలో విధులు ముగించుకుని మంగళవారం రాత్రి 9గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. తోపుగుంట- కండాపురం మధ్యలో పొదలకూరు- సోమశిల మెయిన్ రోడ్డును చిరుత దాటుతుండగా పెంచలయ్య గమనించాడు. అక్కడ నుంచి వేగంగా కండాపురం వద్దకు వెళ్లి అటువైపు వస్తున్నవారిని అప్రమత్తం చేశారు. ఈ విషయం బుధవారం స్థానికంగా కలకలం రేపింది.



ఉరిమే ఉత్సాహం.. సభలో ఉల్లాసం.. స్త్రీ శక్తి..!

సూపర్ హిట్

చంద్రన్న ప్రభుత్వానికి జై కొట్టిన జనం



కింద చోటు లేదు.. అందుకే ఇంతెత్తుకు..!

అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.



మూడు జెండాలు.. మురిపించిన నేతలు





పవనిజం..

యువతరం ఉత్సాహం..

రేషన్ పంపిణీలో ఇక అక్రమాలకు చెక్!

- జిల్లాకు చేరిన కొత్త ఈ-పాస్ యంత్రాలు
- ఇప్పటికే నగరంలో పంపిణీ.. 15 నుంచి గ్రామాల్లో
- వినియోగంపై డీలర్లకు శిక్షణ



నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాల నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బియ్యం, చక్కెర, కందిపప్పు వంటి నిత్యావసరాలు పక్కదారి పట్టకుండా క్యూర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోంది. అలాగే ఈ-పాస్ విధానం అమలులో ఉన్నా అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఈ-పాస్ యంత్రాలలో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో డీలర్‌తోపాటు కార్డుదారులు అవస్థలు పడేవారు. వీటన్నిటికీ చెక్ పెట్టేందుకు అధునాతన సాంకేతికతో కూడిన ఈ-పాస్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చింది. పాత యంత్రాలను వెనక్కి తీసుకుని ఈ నెల 15 నుంచి కొత్త యంత్రాలను డీలర్లకు పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే...

నూతన యంత్రంలో స్మార్ట్ రేషన్ కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కార్డుదారుని పూర్తి వివరాలు డిస్‌ప్లే అవుతాయి. కార్డుదారుకు ఏ ఏ సరు కులు అం దచేయాలో నమోదవుతుంది. వేలి ముద్రలు పడకపోతే ఐరిస్ ద్వారా స్కాన్ చేసేలా ఈ యంత్రాన్ని రూపొందించారు. కార్డు స్కాన్ అయిన తరువాత సరుకుల వివరాలతో కూడిన రశీదు వస్తుంది.

1513 రేషన్ షాపులకు..

జిల్లావ్యాప్తంగా 1513 రేషన్ షాపులు ఉండగా, వీటన్నిటికీ నూతన ఈ-పాస్ యంత్రాలను సరఫరా చేయనున్నారు. నెల్లూరు నగరంలో ఇప్పటికే పంపిణీ చేయగా, గ్రామీణ ప్రాంతాల్లోని డీలర్లకు 15 నుంచి అందజేయనున్నారు. ఈ యంత్రాన్ని ఎలా వినియోగిం చాలో డీలర్లకు శిక్షణ కూడా ఇస్తున్నారు.

15 నుంచి డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దస్తావేజు రిజిస్ట్రేషన్ విధానంలో తీసుకొచ్చిన ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 15 నుంచి పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా డాక్యుమెంట్ రైటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఓటీపీ వల్ల పబ్లిక్ డేటా ఎంట్రీ చేసిన తరువాత ఏదైనా తప్పులు దొర్లితే సరిచేసుకొనే వెసులుబాటు సబ్ రిజిస్ట్రార్లకు ఉండేదని తెలిపారు. అయితే, ప్రస్తుత సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా ఆ వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. చిన్న తప్పు దొర్లినా మొత్తం వివరాలు నమోదు చేయాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఇంకా పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు

'సోమశిల'కు 18,506 క్యూసెక్కుల వరద

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 18,506 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. దీంతో డ్యాంలో 70.810 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,850, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 9,250 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఏపీ పీజీ సెట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్

వెంకటాచలం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీ ఎస్‌సీహెచ్‌ఈ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సులలో ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు వీఎస్‌యూలో అడ్మిషన్లకు సంబంధించిన వివరాలను ఆ వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ఎం హనుమారెడ్డి ప్రకటనలో తెలిపారు. కాకుటూరులోని వీఎస్‌యూ కళాశాలతోపాటు కావలిలోని పీజీ క్యాంపస్‌లో పీజీకి సంబంధించి వివిధ కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, కౌన్సెలింగ్ విధానం కోసం విద్యార్థులు తప్ప నిసరిగా ఏపీ పీజీ సెట్, వీఎస్‌యూ వెబ్‌సైట్‌లను సందర్శించాలని తెలిపారు.



అక్రమ లేఅవుట్లలో వేసిన ప్లాట్లు

ఎల్‌ఆర్ఎస్‌కు దూరం.. దూరం!

- ప్రజల్లో కానరాని స్పందన
- కావలిలో 124 అక్రమ లేఅవుట్లు
- క్రమబద్ధీకరణ ద్వారా రూ.154 కోట్ల ఆర్జనకు అంచనా
- క్షేత్రస్థాయిలో ఆసక్తిచూపని కొనుగోలుదారులు
- ఇప్పటిదాకా రూ.1.28 కోట్ల అంచనాలకే దరఖాస్తులు
- అధికారులు, పాలకుల ఊహలు తలకిందులు

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌ఆర్ఎస్‌పై (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు ఉండటం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంపే లక్ష్యంగా తీసుకువచ్చిన ఈ పథకంపై ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి పాలకులు, అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సుమారు రూ.154 కోట్లకు అంచనాలు వేయగా ఇప్పటివరకు రూ.1.28 కోట్ల అంచనాలకు మాత్రమే దరఖాస్తులు అందాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- వివరాలు 8లో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

కిలో (రూ.లలో)	
బాయిలర్ లైవ్	133
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10437
వెండి కిలో ధర	రూ. 128800
వెండి ఒక గ్రాము	రూ.131.80

ఇరుగాళమ్మ ఆలయానికి పాలకవర్గం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర గ్రామదేవత ఇరుగాళమ్మ ఆలయానికి పాలకవర్గ నియామకం జరిగింది. ఒట్టూ రు సురేంద్ర, అల్లం లక్ష్మీ, త మ్మినేని వెంకటర త్నం నాయుడు, కొండా కోటేశ్వరరెడ్డి, గుద్దేటి చెంచయ్య, కుమార్ హరికుమార్, మన్నేపల్లి వెంకటలక్ష్మి, మోమిడి కుమార్, మిడతల మహాలక్ష్మీలు సభ్యులుగా, ఎక్స్ ఆఫిషియో మెంబరుగా పులికొలను చంద్రశేఖర్ నియమితులయ్యారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆశీస్సులతో ఒట్టూరు సురేంద్రయాదవ్ రెండోసారి చైర్మన్‌గా పదవిని అలంకరించనున్నారు.

'అపోలో'లో రాయితీపై స్ర్కీనింగ్ పరీక్షలు



కరపత్రాలు విడుదల చేస్తున్న గుండె వైద్య నిపుణులు

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అపోలో ఆసుపత్రిలో రాయితీపై గుండె జబ్బులకు స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ సీహెచ్. భక్తవత్సలరెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. గుండె వ్యాధుల దినోత్సవం సందర్భంగా రూ. 11వేల విలువైన వైద్య పరీక్షలు కేవలం రూ. 3,500లకే చేస్తున్నామని వారు వెల్లడించారు. బుధవారం నుంచి అక్టోబరు 31 వరకు ఈ పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. 40 ఏళ్ల దాటిన వ్యక్తులు, గుండె జబ్బుల చరిత్ర ఉన్న కుటుంబాల్లోనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.దేశంలో ఉన్న అపోలో ఆసుపత్రుల్లో గుండె జబ్బులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ షర్మిల నౌషాద్, డాక్టర్ నాగభూషణ్, ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు, కార్డియాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు స్వాహా చేరినవారిపై చర్యలు తీసుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న అనుపమ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళల నగదును నగరంలోని రైల్వేఫీడర్స్ రోడ్డులో గల ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసులురెడ్డి, మెప్మా సీవోలు స్వాహా చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ ఫోరం జిల్లా మహిళా అధ్యక్షురాలు పూనమల్లి అనుపమ కోరారు. బుధవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీ పొదుపు రుణాలు మంజూరు చేసినప్పుడు వారు కుమ్మక్కై, దళితమహిళల పేరుతో రుణాలు మంజూరు చేసుకుని, వారిలో కొంత మందికే రుణాలు అందచేశారని పేర్కొన్నారు. మిగిలిన మొత్తాలను స్వాహా చేశారని ఆరోపించారు. అంతేకాక ఆ ఫీల్డ్ ఆఫీసర్ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని పేర్కొన్నారు. ఈ విషయమై పందిటి సుబ్బయ్య అనే వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. రుణాలు స్వాహ చేసిన ఫీల్డ్ ఆఫీసర్, మెప్మా సీవోలపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

● సుబ్బయ్యతో మాకు సంబంధం లేదు

ఇందుకూరుపేట మండలం కొత్తూరు చింతోపు గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ గ్రూపునకు, పందిటి సుబ్బయ్య అనే వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదని ఆ సంఘం సభ్యులు పీ. సింధు, లక్ష్మీ, కళావతి చెప్పారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. 2023లో తమకు బ్యాంక్ ఆఫ్ భరోడా టౌన్ బ్రాంచ్‌లో రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. గ్రూపులోని వారమంతా ఆ మొత్తాన్ని సమానంగా పంచుకున్నామని చెప్పారు. గ్రూపులోని ఓ సభ్యురాలిని పోలయ్య రెచ్చగొట్టి, పందిటి సుబ్బయ్య రుణం తీసుకున్నాడనే ఆబద్ధపు ప్రచారం చేయిస్తున్నాడన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హోమ్‌సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైకాలజిస్టులు డోమినిక్‌రెడ్డి, నళిని, కోదండరామ్ మాట్లాడుతూ ఆత్మహత్యల నివారణకు సంబంధించిన అంశాలను విద్యార్థినులకు తెలియచేయడంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకపోవడం, సమస్యలను ఎలా సమర్థవంతంగా ఎదుర్కొనాలో తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి, అధ్యాపకులు డాక్టర్ కే.అపర్ణదేవి, డాక్టర్ టీ.మమత, ఎస్.రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాం..

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి,ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. మంగళవారం నిర్వహించిన అన్నదాతపోరు కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా జరిగిందన్నారు. పోలీసులతో ఎన్ని అడ్డంకులు కల్పించినా పెద్ద సంఖ్యలో రైతులు,పార్టీ నాయకులు పాల్గొన్నారని తెలిపారు.

నగరంలో మోస్తరు వర్షం

నెల్లూరు,(ఆంధ్రజ్యోతి) : నగరంలో బుధవారం సాయంత్రం ఉన్నట్టుండి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రోడ్డుపై నీరు ప్రవహించింది.దీంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి ఎండవేడిమికి అల్లాడి ప్రజలు ఒక్కసారిగా వర్షం కురవడంతో ఉపశమనం పొందారు.నగరంలోని రోడ్లపై వర్షపునీటితోపాటు డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లడంతో ప్రజలు నడిచేందుకు కూడా ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగులు, విద్యార్థులు వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రాజరాజేశ్వరి మాలాధారణ ప్రారంభం


మాలాధారణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కోవూరు జనార్దన్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో బుధవారం రాజరాజేశ్వరి అర్ధమండల మాలాధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రతీఏటా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మాలాధారణ చేస్తారు. రాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో ప్రతీ ఏటా మాలాధారణ, అర్ధమండల దీక్షా పూజలు జరుగుతాయి. భక్తులకు దీక్షామాలలను ఆలయం ప్రధాన అర్చకులు రఘురామమూర్తి, అర్చక స్వాములు వేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా సహాయ కమిషనర్ ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొని, పూజలు చేశారు.

పన్నులు చెల్లించని వారికి నోటీసులు

నెల్లూరు(సిటీ),సెప్టెంబరు 10,(ఆంధ్రజ్యోతి) : నగర కార్పొరేషన్‌కు వివిధ రకాల పన్నులు చెల్లించని 1500 మందిపై క్రిమినల్ కేసులు నమోదుకు ప్రీ లిటిగేషన్ ద్వారా నోటీసులు జారీ చేశామని కమిషనర్ నందన్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఇలా నోటీసులు జారీ చేసిన వారంతా జిల్లా కోర్టులో ఈనెల 13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో బకాయిలు చెల్లించి, కేసులు మాఫీ చేసుకోవాలన్నారు. ఆరోజున కార్పొరేషన్ అధికారులు అక్కడ ప్రత్యేక కేంద్రాన్ని అక్కడ ఏర్పాటు చేస్తారని చెప్పారు. తొలుత ఆయన రామలింగాపురం అండర్ బ్రిడ్జీ వద్ద పనులను పర్యవేక్షించారు. ఎన్ఎంసీకి చెందిన సర్వే నెం. 2954-4లోని సర్వేపల్లి బిట్ -2 వెంకటాచలం మండలంలోని 20 ఎకరాల భూమిలో ఎవరైనా మట్టితవ్వకాలు జరిపితే చట్టం ప్రకారం శిక్షార్హులన్నారు.

ప్రజా సంక్షేమానికి 'ప్రజాసత్తా' కృషి

కోవూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి ప్రజాసత్తా సంస్థ పనిచేస్తోందని ఆ సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పులగర శోభనబాబు అన్నారు. కోవూరులో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ 21వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి లో చైతన్య సదస్సులు నిర్వహిస్తామన్నారు. తమ సంస్థ కుల మత రాజకీయ వర్గాలకు అతీతంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కన్వీనర్ చింతల దయాకర్, మహిళా నాయకులు సర్వేపల్లి వరకుమారి, నాగలాపురం మేరీ, మారెళ్ల ప్రేమలీల, దేవరపల్లి ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉక్కపోతకు ఉపశమనం

కోవూరు : రెండు, మూడు రోజులుగా ఎండ దాటికి కోవూరు పరిసర ప్రాంతాల ప్రజానీకం తల్లడిల్లిపోయారు. వేసవిని తలపిస్తూ బుధవారం ఉదయం నుంచి వాతావరణం స్థానికుల్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఉదయం పదిగంటల తరువాత ఇంట్లో నుంచి వెలుపలికి రాలేకపోయారు. ఎండవేడికి తల్లడిల్లిపోయారు. స్థానిక తాలూకాఫీసు కూడలి జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిపోయింది. సాయంత్రానికి వాతావరణం చల్లబడి ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో అన్ని వర్గాల వారు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

పెరుగు రామకృష్ణకు భాషా పురస్కారం


పురస్కారం అందుకున్న పెరుగు రామకృష్ణ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషా పురస్కారాన్ని బుధవారం విజయవాడలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు చేతుల మీదుగా ప్రముఖకవి డాక్టర్ పెరుగు రామకృష్ణ అందుకున్నారు. ప్రభుత్వం 2025 తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వివిధ భాషా సాంస్కృతిక రంగాల ప్రముఖులను ఎంపిక చేసింది. ఈ క్రమంలో వచన కవిత్వ విభాగంలో రామకృష్ణను అవార్డు వరించింది. పురస్కారం కింద ఆయనకు రూ.25వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పురప్రముఖులు, పలువురు కవులు, రచయితలు అభినందించారు.

నేత్రదానం


అయ్యల్ రెడ్డి (ఫైల్)

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గాయత్రీనగర్‌కి చెందిన కుండ అయ్యల్‌రెడ్డి (75) బుధవారం మృతి చెందారు. ఇండియన్ రెడ్‌క్రాస్ పాలక మండలి స భ్యులు శ్రీహరి, మహేశ్వరరెడ్డి సహకారంతో అభయం సంస్థ నిర్వాహకుడు వంశీకృష్ణ స హకారంతో మృతుడి నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో మృతుడి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యులు బద్దేలు అజయ్‌లక్ష్మికి నేత్రదాన గుర్తింపు పత్రాన్ని అందించారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి



నెల్లూరురూరల్,సెప్టెంబరు 10,(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందచేస్తున్న బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు చీఫ్ చంద్రశేఖర్ కోరారు. మండలంలోని సౌత్‌మోపూరులో బీమా పథకాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి, అటల్‌బీమా పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. సురక్ష పథకానికి రూ. 20లు, జీవనజ్యోతికి రూ. 436లు చెల్లిస్తే సహజ మరణం పొందినప్పుడు రూ. 2 లక్షలు పొందవచ్చన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం నాగరాజు, ఎల్డీఎం మణిశంకర్, స్థానిక బ్యాంకు మేనేజర్ శివకుమార్, వెలుగు ఏపీఎం రోస్‌మేరీ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి యూటీఎఫ్ రణభేరి

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన అంశాలపై ఈనెల 15 నుంచి 19 వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి జాతాను నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్.నవకోటేశ్వరరావు తెలిపారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ జాతాను చిత్తూరుజిల్లాలో ఈనెల 15న ప్రారంభించి,ఈ నెల 19న ప్రకాశం జిల్లాలో ముగిస్తామన్నారు. ఈనెల 25న విజయవాడలో జరిగే బహిరంగ సభ ద్వారా సమస్యలను ప్రభుత్వానికి తెలియచేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీవీ.శేషులు, ప్రధాన కార్యదర్శి జీవీ.చలపతిశర్మ, కోశాధికారి ఏ.మురళీధర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి నిబద్ధతకు గుర్తింపు


రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డుగ్రహీత ముజీర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఇందుకూరుపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుడు ముజీర్ నిబద్ధతకు గుర్తింపు దక్కిందని డీఎస్‌డీవో ఆర్కే యతిరాజ్ అన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్.ముజీర్‌కు నరసాపురం ఎంవీఆర్ఆర్ పాఠశాల సిబ్బంది బుధవారం ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్‌డీవో యతిరాజ్, ఎంఈవో సునీల్ పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయ బృందం, శ్రేయోభిలాషులు, పూర్వ విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు ముజీర్‌ను ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు గాదం శ్రీనివాసులు, ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ గురుప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాసులు, సునీల్‌కుమార్, చాంద్‌బాషా, రిటైర్డ్ ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్, సీవీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే జనసేన పార్టీ లక్ష్యం

● ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి

రాపూరు, (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే జనసేన పార్టీ లక్ష్యం అని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఇటీవల రోడ్డు ప్రమా దంలో మరణించిన బట్టు రాము, గంథం సరస్వతమ్మ కుటుంబాలను పట్టణంలోని వారి వారి ఇళ్ల వద్ద పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉన్న వీరి కుటుం బాలకు జనసేన బీమా ద్వారా రూ.5లక్షలు వారి వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతా యని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర్ రామిరెడ్డి, జనరల్ సెక్రటరీ గునుకుల కిషోర్, జిల్లా నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, ఈగి సురేష్, సింగంశెట్టి శ్రీరామ్, సుధా, మాధవ్, మండల నాయకులు జల్లెల రాజేష్, కొండాపురం కస్తూరి, గుండు రాఘవయ్య, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

22 కుటుంబాలు టీడీపీలో చేరిక


పార్టీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరువులపాలెం పంచాయతీకి చెందిన 22 కుటుంబాలు పంటపాలెం సాగునీటి సంఘం అధ్యక్షుడు మనుకూరు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం టీడీపీలో చేరాయి. నెల్లూరులోని ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో బుధవారం సర్వేపల్లి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి 22 కుటుంబాలకు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల సంతృప్తితో ప్రజలు టీడీపీని ఆదరిస్తున్నారు, సీఎం చంద్రబాబు పాలనలో ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్, టీడీపీ నాయకులు పేర్నేటి రామ్మోహన్‌రెడ్డి, కొత్తపల్లి రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అధిక యూరియా వినియోగంతో నష్టమే!

ముత్తుకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పిడతా పోలూ రులో రైతులకు యూరియా వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డీపీఎం రాజ్‌కుమార్ మాట్లాడుతూ అధిక యూరియా వినియోగం వలన పంటలపై చీడపీడలు, కీటకాల బెడద ఎక్కువ అవుతుందని, పంట దిగుబడి ఆలస్యం అవుతుం దన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాల సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ, డివిజనల్ అధికారి ప్రసాద్, మండల వ్యవసాయ అధికారిణి జ్యోత్స్నరాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● ఇందుకూరుపేట : కోఆపరేటివ్ సొసైటీలో బుధవారం అధిక యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఇందుకూరుపేట కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ కృష్ణచైతన్య, మండల వ్యవసాయ శాఖ అధికారి డీ.రఘునాథ్‌రెడ్డి, సొసైటీ సీఈవో మహేష్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌నకు విద్యార్థుల ఎంపిక

వెంకటాచలం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ 2025కి విద్యార్థుల ఎంపిక స్టేట్ లైజానింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎం సుధాకర్, స్టేట్ యూత్ ఆఫీసర్ ఆర్ సైదా నాయక్ పర్యవేక్షణలో జరిగింది. యూనివర్సిటీతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి వచ్చే నెలలో గుజరాత్‌లో జరగబోయే ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కు పంపించడం జరుగుతుందని వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్ తెలిపారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత డాక్టర్ ఎం సుధాకర్, ఆర్ సైదా నాయక్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, సిబ్బంది వెంకట్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం

● తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్‌డీ విల్సన్


తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్‌డీ విల్సన్‌ను సన్మానిస్తున్న అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్

వెంకటాచలం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి తెలుగు సంస్కృత అకాడమీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుం దని తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్‌డీ విల్సన్ (శరత్ చంద్ర) అన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో గిడుగు వెంకటరామ్మూర్తి, కాళోజీ నారాయణ రావు జయంతోత్సవాల సందర్భంగా తెలుగు భాషా పరిణామంలో మైలు రాళ్ళు అనే అంశంపై రెండురోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. సదస్సుకు సభాధ్యక్షులుగా అధ్యయన కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ మాడభూషి సంపత్‌కుమార్ వ్యవహరించగా, ప్రాచీన భాషా శాఖ మైసూరు అధ్యక్షుడు డాక్టర్ ఎల్ఆర్ ప్రేమ్‌కుమార్ సమన్వయ కర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు పరిమి రామ నరసింహం, సంగనభట్ల నరసయ్య, దేవారెడ్డి విజయలక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు

మనుబోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అక్కం పేట గిరిజన కాలనీలో మురుగు కాలువల్లో బ్లీచింగ్‌ను సర్వేపల్లి నియోజకవర్గ సమన్వ యకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు స్వయం గా పిచికారీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ తరఫున గ్రామాల్లో జనసైనికులు కాలనీల్లో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్య క్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మనేని వాణి భవాని, నందూరు శ్రీహరి, పొట్లూరి సుబ్రమ ణ్యం, కంటే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందనలు


సుజాఎస్ నాయర్‌ను అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, పక్కనే రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత

వెంకటాచలం: స్థానిక విక్ర మ సింహపురి యూనివర్సిటీలోని ఎంబీఏ విభాగ అధ్యాపకురాలు, డీన్ (ఆర్ అండ్ డీ) ప్రొఫెసర్ సుజాఎస్ నాయర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. దీంతో బుధవారం ఆమెను వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అభినందించారు. అలాగే వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ కూడా సుజాఎస్ నాయర్‌కు అభినందనలు తెలియజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు చీదరాలకు ఘన సన్మానం


రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చీదరాల చెన్నయ్యను సన్మానించిన ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు డాక్టర్ చీదరాల చెన్నయ్య ఈనెల 5న విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. దీంతో బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆయనకు అభినందన సభ నిర్వహించి మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంఈవోలు దిలీప్‌కుమార్, పీవీ.రత్నం, స్థానిక నాయకుడు దొడ్ల కోదండరామిరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయాలి

మనుబోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉన్న గ్రంథాలయాలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ముందస్తుగా అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఇందులో కమిటీ సభ్యులుగా తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఇద్దరు ప్రధానోపా ధ్యాయులతో కలిపి ఐదు గురిని చేర్చాలని నిర్ణయిం చింది. ఈమేరకు బుధవారం మనుబోలు గ్రంథాలయం లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ సదరు అధికారులకు ప్రభుత్వం పంపిన జీవోని అందించి, కమిటీ ఏర్పాటు గురించి వివరించారు.

విద్యాసామగ్రి పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఇస్కపాళెం పంచాయతీ పల్లిపాళెం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం సహారా సొసైటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎజ్దానీ బాషా, హెచ్ఎం నరసయ్య, ఉపాధ్యాయులు తులసి, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరావు, సొసైటీ సభ్యులు రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

పొదలకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డు పక్కనే పంచాయతీ కార్యాలయం వద్ద సర్వే నెంబరు 191-1ఏలో 34 అంకణాల వివాదాస్పద స్థలంలో తహసీ ల్దారు బాలకృష్ణయ్య బుధవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో తాత్కా లికంగా వున్న కూరగాయల దుకాణాన్ని ఖాళీ చేయించారు. ఈ స్థలంపై హైకోర్టులో వ్యాజ్యం నడుస్తుందని, వ్యాజ్యం పూర్తై తుది తీర్పు వచ్చే వరకు ఈ స్థలంలోకి ఎవరూ ప్రవేశించరా దంటూ హెచ్చరిక బోర్డు పెట్టారు. రెవెన్యూ వారు తమదిగా, మరో ప్రైవేటు వ్యక్తి తన స్థలంగా హైకోర్టుని ఆశ్రయించి ఉన్నారు. దీని విలువ సుమారు రూ.4కోట్లు ఉంటుంది.

C.R.I.M.E N.E.W.S


ప్రమాదంలో మృతి చెందిన జయరామయ్య


గాయపడిన ప్రవీణ్‌ను వైద్యశాలకు తరలిస్తున్న పోలీసులు

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి గాయాలు


గాయపడిన ఎక్సైజ్ సీఐ రమణమ్మ

సంగం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని కనిగిరి రిజర్వాయర్ మలుపు వద్ద ముం బాయి జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగింది. వివరాల మేరకు... నెల్లూరు ధనలక్ష్మీపురానికి చెందిన తలారి జయరామయ్య (58)కు దువ్వూరు చెరువులో పొలాలు ఉన్నాయి. బుధవారం ఉదయం పొలానికి వెళ్లేందుకు ప్రవీణ్ అనే యువ కుడిని తీసుకుని మోటారుబైక్‌పై బయలుదేరాడు. అదేవిధంగా ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ రమణమ్మ తమ వాహనంలో నెల్లూరుకు బయలుదేరారు. ఇరువురి వాహనాలు కనిగిరి రిజర్వాయర్ మలుపు వద్దకు రాగానే ముందు వెళ్తున్న వాహనాలను క్రాస్‌చేసే క్రమంలో అదుపుతప్పి ఢీకొన్నాయి. మోటారు బైక్ రోడ్డుపక్కన ముళ్ల చెట్లలో పడడంతో మోటారు బైక్ నడుపుతున్న తలారి జయరామయ్య అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చొన్న ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా ఎక్సైజ్ వాహనంలో ప్రయాణిస్తున్న సీఐ రమణమ్మకు, డ్రైవర్ పెంచలనరసింహకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సంగం పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని యువకుడు...


అర్మన్ నాయక్ మృతదేహం

కోవూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై రామన్నపాళెం గేటు సమీపంలో బుధవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో అస్సాం రాష్ట్రానికి చెందిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కొడవలూరు నుంచి బైక్‌పై నెల్లూరు వెళ్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన అర్మన్ నాయక్(27), నెల్లూరు నుంచి సచివాలయ ఉద్యోగి కరుణ, తన కుమారుడు రుత్విక్‌తో కలిసి బైక్‌పై రామన్నపాళెం వస్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అర్మన్ నాయక్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సచివాలయ ఉద్యోగి కరుణ, ఆమె కుమారుడు రుత్విక్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కోవూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాకర్స్ పేలిన ఘటనలో

12 మంది అరెస్టు

కావలి/ఉదయగిరి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కావలి సబ్‌డివిజన్ పరిధిలోని ఉదయగిరి మండలం అప్పసముద్రంలో గత నెల 29వ తేదీన వినాయక నిమజ్జన ఉత్సవాలలో భాగంగా కాకర్స్ పేలి 9 మంది పిల్లలు గాయపడ్డారు. ఈ ఘటనలో నడింపల్లి, అప్పసముద్రం గ్రామాలకు చెందిన 12 మంది నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ వీ.శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నడింపల్లి, అప్పసముద్రం గ్రామస్థులు వినాయక పూజలు అనంతరం గతనెల 29వ తేదీన నిమజ్జనానికి విగ్రహాలను తరలిస్తూ వినాయక విగ్రహాలు ఉన్న ట్రాక్టర్‌లలో నిబంధనలకు విరుద్ధంగా క్రాకర్స్ పెట్టుకున్నారు. రెండు గ్రామాల ట్రాక్టర్లు అప్పసముద్రంలో ఎదురెదురు పడినప్పుడు నడింపల్లి గ్రామానికి చెందిన మద్దినేని మధు అదే గ్రామానికి చెందిన బొమ్మినేని విష్ణువర్ధన్‌ను ప్రేరేపించగా ఆయన వరుసగా నాలుగు చిచ్చుబుడ్లు పెట్టి కాల్చారు. ఆ నిప్పురవ్వలు ఎదురుగా ఉన్న అప్పసముద్రం ట్రాక్టర్‌లో ఉన్న చువ్వలపై పడటంతో అవి పేలి ట్రాక్టర్‌లో ఉన్న 9 మంది పిల్లలు గాయపడ్డారు. వారిని వెంటనే చికిత్స నిమిత్తం వింజమూరు, ఆత్మకూరు ఆసుపత్రులకు తరలించారు. అయితే ఈ ఘటనకు సంబంధించి అప్పసముద్రంకు చెందిన వేలమూరి భాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉదయగిరి ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేశారు. దీంతో కావలి డీఎస్పీ శ్రీధర్, ఉదయగిరి సీఐ వెంకట్రావు పర్యవేక్షణలో ఉదయగిరి ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి దర్యాప్తులో భాగంగా ఆ రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి నడింపల్లికి చెందిన బొమ్మినేని విష్ణువర్ధన్, మద్దినేని మధు, వినాయక విగ్రహ కమిటీ సభ్యులు బొమ్మినేని వెంకటాద్రినాయుడు, మద్దినేని మాలకొండయ్య, ఇరిగినేని ప్రసాద్, బురగా రమణయ్య, ఇరిగినేని చినరత్తయ్య, వాకా వెంగళరెడ్డి, అప్పసముద్రం విగ్రహ కమిటీ సభ్యులైన దేవెండ్ల వెంకటేష్, తమ్మిశెట్టి వాసు, సురభి ఆదిలక్ష్మయ్య, సురభి నాగేంద్రలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, ఇదే అంశంపై ఉదయగిరి పోలీస్‌స్టేషనులో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి మాట్లాడారు.

బ్రహ్మంగారి ఆలయంలో చోరీ

జలదంకి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరంలో బ్రహ్మంగారి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ గేట్లు తీసి దొంగలు అమ్మవారి మెడలో ఉన్న రెండు తాళిబొట్లు అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన పూజారి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లతీఫున్నీసా పేర్కొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునులపూడి పంచాయతీ రెడ్డిపాళెంలో గెండి సంపూర్ణమ్మ(47) పాముకాటుకు గురై మృతి చెందింది. వివరాల మేరకు.. బుధవారం ఆమె పొలంలో పని చేస్తుండగా నాగుపాము కాటేసింది. గమనించిన పలువురు వెంటనే చికిత్స నిమిత్తం బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రామచంద్రాపురం వద్దకు వచ్చేసరికి మృతి చెందింది. ఇదే విషయాన్ని ఆసుపత్రిలో వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి అనారోగ్యంతో బాధపడుతున్న భర్త, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే సంపూర్ణమ్మ మృతితో ఆ కుటుంబం వీధిన పడ్డట్లైంది. ఆమె మృతితో విషాదం నెలకొంది.

● ప్రజల్లో కానరాని స్పందన
● కావలిలో 124 అక్రమ లేఅవుట్లు
● క్రమబద్ధీకరణ ద్వారా రూ.154 కోట్ల ఆర్జనకు అంచనా
● క్షేత్రస్థాయిలో ఆసక్తిచూపని కొనుగోలుదారులు
● ఇప్పటిదాకా రూ.1.28 కోట్ల అంచనాలకే దరఖాస్తులు
● అధికారులు, పాలకుల ఊహలు తలకిందులు


అక్రమలేఅవుట్లలో జరుగుతోన్న ఇళ్ల నిర్మాణాలు

ఎల్‌ఆర్‌ఎస్‌కు

దూరం.. దూరం!

కావలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో కావలిలో వేసిన అక్రమ లేఅవుట్లపై కూటమి ప్రభుత్వం రాగానే వాటి రాళ్లు తొలగించి కొరడా ఝుళిపించింది. అలాగే ఆ లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా ఆపేశారు. దీంతో కావలిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. దీనివల్ల రిజిస్ట్రేషన్ ఫీజులు, పన్నుల రూపేణా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా తగ్గిపోయింది. దీంతో రాష్ట్రప్రభుత్వం రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ద్వారా ఆదాయం ఎలా సమకూర్చుకోవాలనే ఆలోచన చేసింది. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకువచ్చి, భారీగా ఆదాయం సమకూర్చుకోవాలని భావించింది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమక్షంలో మున్సిపల్ ప్రాంతాల పరిధిలోని ఎమ్మెల్యేలతో నెల్లూరులో ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా ఒక సమావేశం నిర్వహించారు. కావలిలోనూ టౌన్‌ప్లానింగ్ గుంటూరు రీజనల్ డైరెక్టర్ మధుకుమార్ సమావేశం నిర్వహించి ఎల్‌ఆర్‌ఎస్ వల్ల ప్రయోజనాలు, అక్రమ ప్లాట్లు క్రమబద్ధీకరించుకోకపోతే భవిష్యత్తులో కలిగే ఇబ్బందులను వివరించారు.

● కావలిలో భారీ అంచనాలు

కావలి మున్సిపల్ పరిధిలో సుమారు 816 ఎకరాలలో 124 అక్రమ లేఅవుట్లు వెలిశాయి. వీటిని క్రమబద్ధీకరించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ స్కీం తీసుకువచ్చింది. ఎల్‌ఆర్‌ఎస్ కింద 90 రోజుల్లో దరఖాస్తు చేసుకుంటే 7శాతం, ఆ తర్వాత దరఖాస్తు చేసుకుంటే 14 శాతం ఫీజులు చెల్లిస్తే ఆ ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవచ్చు. దీంతో కావలిలో ఉన్న 124 అక్రమ లేఅవుట్లలో సుమారు 27,61,220 చదరపు గజాలు క్రమబద్ధీకరణ అవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుత ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం ఒక్కో చదరపు గజానికి రూ.8వేలు చొప్పున 27,61,220 చదరపు గజాలకు రూ.154,62,83,200 మున్సిపాలిటీకి ఆదాయం చేకూరుతుందని అంచనావేశారు. దీంతో మున్సిపల్ ఆర్థిక కష్టాలు తీరడమేగాక కావలిలో అక్రమ లేఅవుట్ల సమస్య పరిష్కారమై రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుందని భావించారు.

● క్షేత్రస్థాయిలో కానరాని స్పందన

ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా భారీగా ఆదాయం చేకూరుతోందని అధికారులు, పాలకులు అంచనాలు వేసుకున్నా క్షేత్రస్థాయిలో స్పందన కనిపించటం లేదు. ఒక్కో ప్లాటు క్రమబద్ధీకరణకు సుమారు రూ.1.6 లక్షలు ఖర్చుపెట్టాల్సి ఉండటంతో ప్లాట్ల కొనుగోలుదారులు శ్రద్ధ చూపడంలేదు. మళ్లీ ధరలు వచ్చి అమ్ముకోవాలనే ఉద్దేశంతో కొనుగోలు చేసినవారు ఎక్కువగా ఉండటంతో వారు ఎల్‌ఆర్‌ఎస్‌పై ఆసక్తి చూపడంలేదు. మరికొందరైతే ఈ స్కీం ఇలాగే కొనసాగుతుందనే నమ్మకం ఏముందని, ఒకవేళ రేపు రాష్ట్రంలో ప్రభుత్వం మారితే అప్పుడు పరిస్థితి ఏమిటనే భావనలో ఉన్నారు. అయితే త్వరలో ఇల్లు కట్టుకునే వారు మాత్రం ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. 27,61,220 చదరపు గజాలకు గాను ఇప్పటివరకు 1600 గజాలకు మాత్రమే దరఖాస్తులు చేసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించారు. సుమారు రూ.154 కోట్లకు అంచనాలు వేయగా ఇప్పటివరకు రూ.1.28 కోట్ల అంచనాలకు మాత్రమే దరఖాస్తులు అందాయి.

> **నిర్మాణాలకు అనుమతి ఉండదు**
>
> 
>
> అక్రమ లేఅవుట్లలో ఉన్న ప్లాట్లు ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకోకపోతే భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వం. ఎల్‌ఆర్‌ఎస్‌పై విస్తృత ప్రచారం చేపట్టి భవిష్యత్తులో వచ్చే ఇబ్బందుల గురించి తెలియజేస్తూ దీనిని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లతాం.
>
> - శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కావలి

క్షయ వ్యాధిగ్రస్థుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయండి : డాక్టర్ నితీష్‌రామ్

నెల్లూరు (వైద్యం): జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించి, వారి వివరాలను నిశ్చయ పోర్టల్‌లో నమోదు చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ నితీష్‌రామ్ తెలిపారు. బుధవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో కమ్యూనిటీ హెల్త్ అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఎవరినైతే క్షయ అనుమానితులను గుర్తించారో వారికి కఫం పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం నెల్లూరు రూరల్ టీబీ యూనిట్ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, క్షయ నివారణ జిల్లా కోఆర్డినేటర్ విజయకుమార్, టీబీ, హెచ్‌ఐవీ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, వేణు, శోభారాణి, పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో కలిసి ఆర్టీసీ డిపోను పరిశీలిస్తున్న ఎండీ ద్వారకా తిరుమలరావు

త్వరలో రాష్ట్రానికి

1050 ఎలక్ట్రిక్ బస్సులు

● ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించండి
● ఉద్యోగులతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

ఉదయగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : త్వరలో రాష్ట్రానికి 1,050 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. బుధవారం ఉదయగిరి డిపోను జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆయన విలేకరులతో ఎండీ మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం అమలు తీరు ఎలా ఉంది, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎలాంటి చర్యలు చేపట్టాలి తదితర అంశాలపై డిపోలను సందర్శిస్తున్నట్లు చెప్పారు. ఆక్యుపెన్సీ పెరిగినా టిక్కెట్ రూపంలో సంస్థకు ఆదాయం రాదని, ప్రభుత్వమే సంస్థకు ఆదాయం సమకూరుస్తుందన్నారు. ఆర్టీసీ సిబ్బంది సైతం ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుని సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనుకున్న ప్రకారం కొత్త బస్సులన్నీ వస్తే రద్దీని తట్టుకోవడంతోపాటు పాత బస్సులను తొలగించడం జరుగుతుంన్నారు. మహిళా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ బస్టాండ్లలో మరుగుదొడ్లు, తాగునీరు వసతులు అదనంగా కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం డిపో ఆవరణలో నిర్వహించిన సమావేశంలో సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేసి ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈడీ జోన్-3 నాగేంద్ర ప్రసాద్, ఈడీవో అప్పలరాజు, ఆర్ఎం షమీమ్, డిప్యూటీ సీటీఎం రమేష్ కుమార్, వో అండ్ ఎంఐఎస్ రవికాంత్, బీజేపీ నాయకులు, ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బియ్యాన్ని పాఠశాలలకే

సరఫరా చేయాలి : అపస్

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్నభోజన పథకానికి సంబంధించిన బియ్యాన్ని నేరుగా పాఠశాలలకే సరఫరా చేయాలని అపస్ నేతలు కలెక్టర్ ఓ. ఆనంద్‌ను కోరారు. బుధవారం వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.రాజగోపాలాచార్యులు, పీ.అనిల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మధ్యాహ్న భోజన పథకానికి అందించే బియ్యాన్ని పాఠశాలలకు అందించకుండా, క్లస్టర్ పాయింట్ల వద్దకు చేర్చి, హెచ్‌ఎం లను తీసుకెళ్లమంటూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. హెచ్‌ఎంలు వాటిని పాఠశాలలకు తరలించడం కష్టంగా మారిందన్నారు. దీనిపై చొరవ తీసుకుని ఇబ్బందులను తొలగించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి బియ్యాన్ని నేరుగా ఆయా పాఠశాలల వద్దకే సరఫరా చేయాలని ఆదేశించారు. అలాగే 2024 సాధారణ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్‌వోలు డ్యూటీ సర్టిఫికెట్లు అందించలేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై కూడా వెంటనే అధికారులతో మాట్లాడి వెంటనే సర్టిఫికెట్‌లు అందించాలని ఆదేశించారు. దీంతో అపస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు కలెక్టర్‌కి భరతమాత చిత్రపటాన్ని అందచేశారు.

గంజాయి రవాణాపై దాడులు


నిందితుల వివరాలు తెలుపుతున్న రైల్వే ఇన్‌స్పెక్టర్ సుధాకర్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాపై తిరుపతి జిల్లా గూడూరు రైల్వేస్టేషన్‌లో దాడులు చేసి, 10.100 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. నెల్లూరు రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో బుధవారం ఇన్‌స్పెక్టర్ సుధాకర్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈగల్ ఇన్‌చార్జ్ టీం, జీఆర్‌పీ సిబ్బంది సంయుక్తంగా గూడూరు రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణాపై తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో తమిళనాడు రాష్ట్రం, కృష్ణగిరి జిల్లాకు చెందిన తరుణ్, అజయ్, విఘ్నేష్ గోపాలప్పను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసులు తమదైన శైలిలో విచారించగా, 14 ప్యాకెట్లలో ఉన్న 10.100 కిలోల గంజాయి దొరికింది. దాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన హెచ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, ఈగల్ టీమ్ హెడ్ కానిస్టేబుల్ టీ. సతీష్ బాబు, సిబ్బంది యోగానంద, ప్రవీణ్, తదితరులను నెల్లూరు రైల్వే డీఎస్పీ జీ. మురళీధర్ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఎస్ఐ ఎన్ హరిచందన పాల్గొన్నారు.

యానాది సంఘం నేతలపై

కేసు నమోదు

నెల్లూరురూరల్,సెప్టెంబరు 10,(ఆంధ్రజ్యోతి) : యానాదుల సంక్షేమ సంఘం నాయకులు కేసీ పెంచలయ్య, చెంబేడు ఉషపై నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. సీఐ గుంజి వేణు కథనం మేరకు వివరాలు.. మండలంలోని సజ్జాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ 2022లో అత్యాచారానికి గురైంది. అప్పట్లో బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులపై అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. ఈ మేరకు ప్రభుత్వం ఆమెకు నష్టపరిహారంగా రూ. 1.50 లక్షలు మంజూరు చేసింది. ఇందులో రూ. 50 వేలను ఆమె నెల్లూరు అర్బన్ బ్యాంకులో కొన్ని నెలలు క్రితం డ్రా చేసింది. అందులో రూ. 10 వేలు ఆమెకిచ్చి మిగిలిన రూ. 40 వేలు సంక్షేమ సంఘానికి కావాలని పెంచలయ్య, ఉష తీసుకున్నారని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపింది. మళ్లీ కొద్దిరోజుల తరువాత రూ. లక్ష చెక్కుపై ఆమె సంతకం తీసుకుని, ఆమెను వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఉంచి బ్యాంకులో నగదు డ్రా చేసి రూ. 5 వేలు ఇచ్చి మిగిలిన రూ. 95 వేలను సంక్షేమ సంఘం ఖర్చుల కోసమని వారు తీసుకున్నారని బాధితురాలు పేర్కొంది. అంతేకాక తన కేసులో ముద్దాయిలుగా ఉన్న వారి వద్ద నుంచి కూడా రూ. 2 లక్షలు తీసుకున్నారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బుధవారం వారిద్దరుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విజయ డెయిరీ పాల సేకరణ ధర పెంపు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకారం సమితి (విజయ డెయిరీ) పాల సేకరణ ధరను పెంచుతున్నట్లు చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. నగరంలోని విజయ డెయిరీలో బుధవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు రైతులకు కేజీ వెన్న శాతానికి రూ.775 లెక్కన లీటరు పాలకు రూ.77.50, సొసైటీ నిర్వహణకు రూ.1.50 ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16 నుంచి కేజీ వెన్నశాతానికి రూ.785 లెక్కన, లీటరు పాలకు రూ. 78.50లతోపాటు సొసైటీ నిర్వహణకు రూ.1.50 కలుపుకొని రూ.80 ఇవ్వనున్నట్లు తెలిపారు. పాడి రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డెయిరీ ఎండీ వీసీ కృష్ణమోహన్,బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	133
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100):550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.10437
వెండి కిలో ధర	రూ. 128800
వెండి ఒక గ్రాము	రూ.131.80

కాలేజ్ న్యూస్ లెటర్స్ 2కే25 రిలీజ్

బిట్రగుంట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో ప్రిన్సిపాల్ వీవీఎన్‌రెడ్డి బుధవారం కాలేజ్ న్యూస్ లెటర్స్ 2కే25 రిలీజ్ చేశారు. డిపార్ట్‌మెంట్ వైజ్ న్యూస్ లెటర్స్‌లో మే 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు కళాశాలలో జరిగిన అన్ని కార్యక్రమాలు పొందుపరచి ఉంటాయన్నారు. జాతీయ, రాష్ట్ర, యూనివర్సిటీ, జిల్లాస్థాయిలో పొందినటువంటి అన్ని వివరాలు ఇందులో ముద్రించి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో ఆర్వీ.రామణారెడ్డి, న్యూస్‌లెటర్స్ చీఫ్ ఎడిటర్స్, అన్ని విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

● జడ్పీ సీఈవో మోహనరావు

కొండాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణ లో నిర్లక్ష్యం తగదని జడ్పీ సీఈవో జే.మోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని తూర్పుఎర్రబల్లిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. ఆయ న మాట్లాడుతూ గ్రామాలలో చెత్త సేకరణ చేసి చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి గ్రామాలను పరిశుభ్రం గా ఉంచాలని ఐవీఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపడుతున్న సర్వేలు వెంటనే పూర్తిచేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సర్వేలు పూర్తయితేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు వర్తిస్తాయన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ఆయన రికార్డు లను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణరావు, డిప్యూటీ ఎంపీడీవో బి.శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సర్పంచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, ఐసీడీఎస్ పీడీ హేనాసూజన్

కావలి(టౌన్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కావలి ఆర్డీవో కార్యాలయంలో బుధవారం 13 అంగన్వాడీ కార్యకర్తలు, 43 సహాకుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కావలి ప్రాజెక్ట్ పరిధిలో 4 కార్యకర్తలు, 28 సహాకులు, వింజమూరు ప్రాజెక్ట్ పరిధిలో 8 కార్యకర్తలు, 9 సహాకులు, కోవూరు ప్రాజెక్ట్ పరిధిలో 1 కార్యకర్త, 6 సహాకుల పోస్టులకు జరిగిన ఇంటర్వ్యూలకు కార్యకర్తల పోస్టులకు 39మంది, సహాయకుల పోస్టులకు 67 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఆర్డీవో వంశీకృష్ణ పర్యవేక్షణలో ఐసీడీఎస్ పీడీ హేనాసూజన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజితలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి, వింజమూరు, కోవూరు ఐసీడీఎస్ సీడీపీవోలు సౌజన్య, పద్మజ, శారదలు పాల్గొన్నారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న మినీ లారీ

మహిళ మృతి, ముగ్గురికి గాయాలు



మృతి చెందిన వాయిళ్ల మంగమ్మ

గుడ్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఆపి ఉన్న ఆటోను వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం మినిలారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆటోకు సైడు నిలబడి ఉన్న నలుగు రు కూలీలలో ఒక మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రమైన గుడ్లూరు ఉప్పుటేరుకు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. బుధవారం ఉదయం కావలి మండలం తుమ్మలపెంటకు చెందిన వ్యవసాయ కూలీలు గుడ్లూరు మండలంలో కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం తిరిగి కావలికి ఆటోలో బయలుదేరారు. ఈ ఆటో గుడ్లూరు సమీపంలోని ఉప్పుటేరు దగ్గరకు రాగానే వర్షం అధికంగా పడడంతో రోడ్డుపక్కన ఆపి, పక్కనే ఉన్న చెట్టుకిందకు వెళ్లారు. అంతలో కందుకూరు వైపు నుంచి అతివేగంతో కావలికి వెళుతున్న డీసీఎం మినీ లారీ ఆగి ఉన్న ఆటోను వెనుకవైపు ఢీకొట్టడంతోపాటు, ఆటో పక్కన నిల్చొని ఉన్న నలుగురు కూలీలను కూ డా ఢీకొంది. దీంతో తుమ్మలపెం టకు చెందిన కూలీలు వాయిళ్ల మంగమ్మ (45) తీవ్ర గాయాలు కావడంతో కిఇత్స నిమిత్తం గుడ్లూరు ప్రభుత్వం వైద్యశాలకు 108లో తర లించారు. అయితే ఆమె మార్గమధ్యంలోనే మృతి చెందింది. మరో ముగ్గురు కూ లీలు పాలమ్మ, జాలమ్మ, లక్ష్మిల కు స్వల్ప గాయాలు తగల డంతో వారిని కందుకూరు ఏరియా వైద్య శాలకు తరలించారు. మంగమ్మ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరి యా వైద్యశాలకు తరలించినట్లు ఏఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మినీలారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు

● సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ

కొండాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దని కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు అందచేసిన విజ్ఞప్తులతోపాటు పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిశీలించి సత్వరమే పరిష్కారం అందించాలన్నారు. అనంతరం సాయిపేటలో వివాదంలో ఉన్న వాటర్‌ప్లాంటు నిర్మాణాన్ని పరిశీలించి కోర్టు ఆదేశాల ప్రకారం ఎవ్వరికీ ఇబ్బందులు కలుగకుండా చూడాలని తహ సీల్దారు సురేష్‌బాబుకు సూచించారు. ఆయన వెంట ఆర్ఐ అనుదీప్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో సబ్‌కలెక్టర్ తనిఖీ



తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ

ఉలవపాడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమ వంశీ బుధవారం ఉలవపాడు తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా కార్యాలయం నిర్వహణ పనితీరుని పర్యవేక్షించేందుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. మ్యుటేషన్లు, పాసుపుస్తకాల ఆన్‌లైన్, సకాలంలో అవస రమైన భూసర్వే, రికార్డుల నిర్వహణ తది తర అంశాలను పరిశీలించారు. మండలం లోని రెవెన్యూ సమస్యలపై తహసీల్దారు శ్రీనివాసులతో చర్చించారు. ఈ సందర్భంగా కరేడు భూసేకరణ అంశంపై ఎంతమంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇండోసోల్‌కు ఇచ్చారు.. ఎంతమంది రైతులకు పరిహారం అందిందని సబ్ కలెక్టర్ హిమవంశీని ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా పూర్తి సమాచారం తీసుకుంటున్నామని, అందిన వెంటనే తెలియపరుస్తానన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తి దారుణ హత్య

- మొగిలిచెర్లలో అర్ధరాత్రి ఘటన
- హంతకుల కోసం రెండు పోలీసు బృందాల ఏర్పాటు
- మృతదేహాన్ని పరిశీలించిన డీఎస్పీ బాలసుబ్రహ్మణ్య



శ్రీనివాసులు హత్య గురించి బంధువులను విచారిస్తున్న కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

లింగసముద్రం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్లలో తన ఇంటి వరండాలో నిద్రిస్తున్న ఓ వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, గ్రామస్థుల సమాచారం మేరకు.. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన ఆవుల శ్రీనివాసులు (45) గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా భార్య వసంత నాలుగేళ్ల క్రితం మృతి చెందింది. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేశాడు. అప్పటి నుంచి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తన ఇంటి వరండాలో మంచంపై ఒంటరిగా నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగులు దేనితో కొట్టారో ఏమోగానీ తల వెనుక భాగంలో కణతపై బలమైన రక్త గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం 6 గంటల సమయంలో ఆయన అల్లుడు రాజేంద్రప్రసాద్ అక్కడికి వచ్చి మామను లేపేందుకు ప్రయత్నించగా ఆయనకు రక్తగాయాలై కదలకపోవడంతో చనిపోయాడని భావించి బంధువులకు తెలిపాడు. దీంతో వారు పరిశీలించి పోలీసులకు సమాచారమిచ్చారు. గుడ్లూరు సీఐ జీ.మం గారావు, లింగస ముద్రం ఎస్ఐ ఎం.నారాయణలు మొగిలిచెర్లకు చేరుకుని సంఘటనా స్థలాన్ని, శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించారు. తలపై ఉన్న గాయాలను బట్టి శ్రీనివాసులును హత్య చేసి నట్టుగా నిర్ధారించారు. అలాగే శ్రీనివాసులు కుమార్తెలు మనీషా, మౌనీషాలు, బంధువుల నుంచి వివరాలు సేకరించారు. హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం నెల్లూరు నుంచి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ అధికారులు, సిబ్బంది వచ్చి ఆధారాలు సేకరించారు.

నిందితుల కోసం రెండు పోలీసు బృందాల ఏర్పాటు : డీఎస్పీ

శ్రీనివాసులును హత్య చేసిన నిందితులను పట్టుకొనేందుకు లింగసముద్రం ఎస్ఐ నారాయణ, వలేటివారిపాలెం ఎస్ఐ మరిడినాయుడు ఆధ్వర్యంలో రెండు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్టు కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. శ్రీనివాసులు హత్య విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సీఐ, ఎస్ఐలతో పాటు స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీనివాసులును ఎవరో దుండగులు కొట్టి చంపారని, నిందితులను త్వరలో పట్టుకుని కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పోస్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే ఎవరు హత్య చేశారు, ఎందుకు చేశారు అనే కారణం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. అయితే హత్యకు వివాహేతర సంబంధమా? లేక ఇంకేదైనా కారణముందా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. శ్రీనివాసులు మృతితో కుమార్తెలు, బంధువులు బోరున విలపించారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.



మొగిలిచెర్లలో దుండగుల చేతిలో దారుణహత్యకు గురైన శ్రీనివాసులు

యువకుడి ఆత్మహత్య

కందుకూరు(ఆంధ్రజ్యోతి): ఒడిశాకు చెందిన టంకేశ్వర్(24) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను పట్టణంలోని విప్పగుంట రోడ్డులో ఓ రంపకోత మిల్లులో పనిచేస్తూ గత జనవరిలో ఒడిశాకు వెళ్లిపోయాడు. తిరిగి సోమవారం వచ్చాడు. ఈ క్రమంలో రూములోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఏరియా ఆసుపత్రి ఉద్యోగిపై రోగి సహాయకుడి దాడి



చికిత్స పొందుతున్న మధు

కావలి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కావలి ఏరియా ఆసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న మేల్ నర్సింగ్ ఆఫీసర్ మధుపై చికిత్స పొందుతున్న రోగి కోటమ్మ సహాయకుడు మొగిలి అనూక్ దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన బుధవారం రాత్రి 9.30 గంటలకు కావలి ఏరియా వైద్యశాలలో జరిగింది. వైద్యాధికారులు, సిబ్బంది కథనం మేరకు.. మొగిలి కోటమ్మ పక్షవాతంతో బుధవారం ఉదయం కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరింది. ఆమెకు మధ్యలో ఫిట్స్ రావడంతో ఆమె చేతికి ఉన్న ఐవీ క్యానల్ ఉంచుకోకుండా పీకేస్తోంది. రెండు పర్యాయాలు పీకేసినా మళ్లీ అక్కడ సిబ్బందిచే డాక్టర్ చైతన్య దానిని కట్టించి పేషంట్‌ను నార్మల్ పరిస్థితికి తీసుకు వచ్చారు. అయితే ఆమెతో వచ్చిన సహాయకుడు అనూక్ తో ఐవీ క్యానల్ పీకేస్తుంటే మీరు దగ్గరుండి చూసుకోవాలి కదా అని అక్కడ సిబ్బంది చెప్పా రు. దీంతో ఆయన వారితో మీరెందుకు ఉండే దంటూ దురుసుగా ప్రవర్తించాడు. అక్కడ ఉన్న ఎంఎన్‌వో మధు ఆయనను ఎదిరించారు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం జరిగి ఒకరినొకరు తోసుకోగా అనూక్ కాలితో మధును తన్నాడు. అయితే ఆ పేషంట్‌ను నెల్లూరుకు తరలించాల్సి ఉండటంతో ఆ సమస్యను సర్దుబాటు చేశారు. అయితే పేషంట్‌ను నెల్లూరుకు తరలించే సమయంలో ఆమె సహాయకుడు అనూక్ బండరాయితో ఎంఎన్‌వో మధు తలపై కొట్టి అక్కడ నుంచి పారిపోయాడు. దీంతో ఆయనకు తలపై బలమైన గాయం కావడంతో చికిత్స అందించి పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

పాఠశాలల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో షేక్ మస్తాన్‌వలి

సీతారామపురం, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు, గణిత సామర్థ్యాలలో విద్యార్థులు రాణించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. మండల పరిధిలోని నెమళ్లదిన్నె, గంగవరం ప్రాథమిక పాఠశాలలను బుధవారం తనిఖీ చేసి విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలను పరిశీలించారు. తెలుగు గుణింతాలు సులభంగా పిల్లలకు ఎలా నేర్పించాలో తెలియజేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పామనబోయిన బాలకృష్ణ, జన్యాల వెంకటేశ్వర్లు, సీఆర్పీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

కలువాయి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివసాయి కళాశాలలో బుధవారం గ్యాస్ వినియోగంపై స్థానిక ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఎస్ఐ మార్కు కల్గిన పైపులు, స్టవ్, రెగ్యులేటర్ మాత్రమే వాడాలని, గ్యాస్ సిలిండర్ ఇంటికి డెలివరీ సమయంలో సీల్ ఉందా లేదా అని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మేనేజర్లు ఎస్కే షాహులు, నరసింహ, శివ, ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉమర్‌బాబు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందడంతో బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రమణమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన అధికారులకు సన్మానం

సంగం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న శైలజ, డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్‌కు ఇటీవల ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. దీంతో బుధవారం కార్యాలయ సిబ్బంది వారిరువురిని ఘనంగా సత్కరించారు. అదేవిధంగా వెంగారెడ్డిపాళెం సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బందితోపాటు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ డైరెక్టర్‌గా 'గని' ప్రమాణ స్వీకారం

వింజమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సహకార సంఘం సొసైటీ డైరెక్టర్‌గా గని శ్రీనివాసనాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతతో విధులు నిర్వహిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, సీఈవో మేకల రమణయ్య, నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వినియోగం అనర్థదాయకం



తరుణవాయిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

సంగం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మోతా దుకు మించి యూరియా వాడితే అనార్థమేనని వ్యవసాయాధికారి శశిధర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని చెన్నవరపాడు, తరుణ వాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగం గా మోతాదుకు మించి యూరియా వాడితే జరిగే నష్టాలు, అనార్థాలను రైతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన రైతు సేవా కేంద్రాల్లో రైతులతో మాట్లాడుతూ అధిక యూరియా వాడడం వల్ల ఖర్చులు పెరగడంతో పాటు, పొలం దెబ్బతింటుదన్నారు. నేల సారాన్ని దెబ్బతీస్తుందన్నారు. మొక్కలు విరివిగా పెరిగి చీడపీడలు ఆశించే అవకాశం ఎక్కువని, భూగర్భ జలాలు కాలుష్యం జరిగి ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. జీవన ఎరువులు వినియోగించుకోవాలని, అధిక యూరియా వాడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

● **ఉదయగిరి:** రైతులు పంటలకు అధికంగా యూరియాను వినియోగించడం అనర్థదాయకమని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని కొండాయపాళెం, జీ.చెరువుపల్లి గ్రామాల్లో రైతులకు యూరియా వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ర్యాలీలు చేపట్టి వ్యవసాయాధికారుల సిఫార్సు మేరకే పంటలకు ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● **దుత్తలూరు:** మండలంలోని కొత్తపేట, తెడ్డుపాడు రైతుసేవా కేంద్రాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్ అధిక ఎరువులు వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ చంద్రశేఖర్, రోషిణి, రైతులు తదితరులు పాలొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు ఎరువులు తరలిస్తే కేసులు



దుకాణంలో ఎరువులను పరిశీలిస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఆత్మకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మ కాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హెచ్చరించారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపణలు రావడంతో బుధ వారం పట్టణం లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆత్మకూరులోని పలు దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కె వేణుగోపాల్, విజిలెన్స్ సీఐ షేక్ సుభాని, వ్యవసాయాధికారి కిషోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన చిన్నారులకు ఆర్థిక సాయం పెంచాలి



గాయపడిన చిన్నారులను పరామర్శిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘ ఐక్యవేదిక నాయకులు

ఉదయగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం గ్రామంలో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవంలో బాణసంచా పేలి తీవ్రంగా గాయపడ్డ చిన్నారులకు ప్రభుత్వం ఆర్థికసాయం పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జనరల్ కార్యదర్శి ఆర్ వెంకటజ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితారాంయాదవ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజగోపాల్, శ్రీనివాసుల యాదవ్‌లతోపాటు పలువురు నాయకులు అప్పసముద్రం గ్రామానికి చేరుకుని బాణ సంచా పేలుడు ఘటనలో తీవ్ర గాయాలపాలై ఇంటికి చేరుకున్న చిన్నారులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాద తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఒక్కో చిన్నారికి రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాగౌడ సంఘం నాయకులు రాముగౌడ్, గోపాల్, జనసేన జిల్లా నాయకులు పవన్‌కుమార్‌యాదవ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని సర్పంచు దిలీప్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రధాన వీధిలోని మురుగు కాలువలో పేరుకు పోయిన చెత్తా, చెదారాన్ని ఆయనే స్వయంగా తొలగించడంతో పాటు కార్మికుల ద్వారా శుభ్రం చేయించారు. అలాగే బస్టాండ్ సెంటర్‌లోని విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా అల్లుకుపోయిన కంపచెట్లను సైతం తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు వెంటనే తన దృష్టికి తీసుకొస్తే పంచాయతీ కార్యదర్శి సహకారంతో పరిష్కరించడం జరుగుతుందని హామినిచ్చారు.

జాబ్‌మేళాకు మంచి స్పందన

ఆత్మకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ బియస్ఆర్ ఐటీఐ యాజమాన్యం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఉదయం 9 గంటల నుంచి 2గంటల వరకు జరిగిన ఈ జాబ్ మేళాకు పలు పేరుగాంచిన ఎంఎన్‌సీ, గ్రీన్‌టెక్, బ్లూస్టార్, టీవీఎస్ గ్రూప్, ఎలక్ట్రోస్టీల్, గోల్డ్ ఫీల్డ్స్, యమహా, మారుతీ సుజికి, కిసాన్ క్రాఫ్ట్, డ్రోన్ టెక్నాలజీ తదితర సంస్థలు రాగా సుమారు 52 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఎంపికైన వారికి రెండు రోజుల్లో కాల్ లెటర్లు ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్, ప్రకాష్ బీగాల, సంగం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ మురళీ, కంపెనీల ప్రతినిధులు, ఐటీఐ కళాశాల సిబ్బంది నాపా సుధీర్, కృష్ణయ్య, బాదుల్లా, సుష్మీన్, శోభా తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 636 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 408 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 228 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 320 కాగా, కనిష్ఠ ధర రూ. 110 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

వింజమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరులో ఉన్న ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కె ఖాదర్‌బాషాకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా బుధవారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పి కొండారెడ్డి, జె వెంకటేశ్వర్లు, ఏ చంద్రన్, విద్యార్థులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఖాదర్‌బాషా సేవలను కొనియాడారు.

చాకలి ఐలమ్మకు నివాళి



ఐలమ్మకు నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి కోసం సాయుధ పోరాటాలు సాగించిన చాకలి ఐలమ్మ సేవలు ఎనలేనివని మండల రజక సంఘం అధ్యక్షుడు మాచర్ల గురవయ్య అన్నారు. బుధవారం బస్టాండ్ సెంటర్‌లో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు యాదగిరి హజరత్, ఉపాధ్యక్షుడు కంచర్ల వెంకటే శ్వర్లు, కోశాధికారి యాదగిరి ప్రసాద్, కార్యదర్శి యాదగిరి తిరుపాలు, సభ్యులు పాల్గొన్నారు.

నగదు అపహరణ

సీతారామపురం, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ చేతిలో నగదు అపహరించి గుర్తుతెలియని వ్యక్తి పరారైన ఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. స్థానిక కెనరా బ్యాంక్‌లో సంగసానిపల్లి గ్రామానికి చెందిన నిలి విజయమ్మ రూ. 13వేలు నగదు విత్‌డ్రా చేసుకుని బయటకు వచ్చి లెక్క చూసుకుంటుండగా గుర్తుతెలియని దుండగుడు ఆమె చేతిలోని నగదు అపహరించి బైక్‌పై పరారయ్యాడు. విజయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ శివకృష్ణరెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నిబంధనలు పాటించాలి

ఉదయగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎంఈవో-2 టీ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను ఆయన సందర్శించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

తుడా చేతికి 'శెట్టిపల్లె ఫైల్స్'

- అందరికీ ఇళ్లు పథకం కింద రెండు సెంట్లు కేటాయిస్తూ జీవో జారీ

తిరుపతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'శెట్టిపల్లె ఫైల్స్' తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తిరిగి తుడాకు బదలాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శెట్టిపల్లె అభివృద్ధి బాధ్యత తుడా చేతికి అప్పగించడంతో పాటు అందరికీ ఇళ్లు పథకం కింద 1.5 సెంట్లు కంటే తక్కువ ఉన్నవారుకూడా 2 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని బుధవారం రాష్ట్ర ప్రభుత్వం (జీవో నెం:328) ఉత్తర్వులు జారీచేసింది. శెట్టిపల్లె వివాదానికి ఫుల్‌స్టాప్ పెడుతూ ఇటీవల జరిగిన మంత్రిమండలి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఆమేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం శెట్టిపల్లెను అభివృద్ధి చేసే బాధ్యతను తుడాకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. శెట్టిపల్లె బాధితుల్లో 961 మంది ప్లాట్ల యజమానులకు 15-18 అంకణాలే వచ్చింది. వీరందరికీ 2 సెంట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది.

గతంలో తుడాను పక్కన పెట్టి : తుడా పరిధిలోఉన్న శెట్టిపల్లెను గత వైసీపీ పెద్దలు మూడురోజుల్లోనే నగరపాలక సంస్థ పరిధిలోకి తీసుకొచ్చేశారు. 2021 సెప్టెంబరు 28వ తేదీన శెట్టిపల్లె భూసమస్యపై అప్పటి ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి రెవెన్యూ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. కార్పొరేషన్‌లో విలీనానికి పంచాయతీ తీర్మానం కావాలని సూచించారు. ఆ మరుసటి రోజే (29వ తేది) శెట్టిపల్లె పంచాయతీలోని శెట్టిపల్లె, శెట్టిపల్లె హరిజనవాడ, సీఆర్ఎస్ క్వార్టర్స్, ఉప్పరపాళెం, వినాయకనగర్‌లను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని కోరుతూ పంచాయతీ తీర్మానం జరిగింది. 30వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో శెట్టిపల్లె విలీనం తంతు పూర్తిచేశారు.

హలో.. ఐయామ్ రోడ్ డాక్టర్



రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలంటే ఇకపై మనుషులతో పనిలేదు. 'రోడ్ డాక్టర్' పేరిట తిరుపతి నగరపాలక సంస్థకు వచ్చిన ఓ వాహన యంత్రం నిమిషాల్లో గుంతలను పూడ్చేస్తోంది. బుధవారం నగరంలోని పలు రోడ్లపై ఏర్పడిన గుంతలను ఈ యంత్రం సాయంతో పూడ్చారు. ఈ యంత్రం పనితీరును కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. దీనిని సుమారు రూ1.5 కోట్లతో కొన్నామన్నారు. నూతన టెక్నాలజీతో సిద్ధం చేసిన రోడ్ల డాక్టర్ యంత్రం ద్వారా ఎప్పటికప్పుడు గుంతలను పూడ్చేందుకు అవకాశం ఉందన్నారు. సీసీ రోడ్లు, తారు రోడ్లు పూడ్చేందుకు దీనిని వినియోగిస్తారన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

యూరియా కొరత లేదు

జిల్లాలో యూరియా కొరత లేదని వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్లగా జిల్లాలో యూరియా కొరత లేదని, రబీ సీజన్ అక్టోబరు 15 నుంచి ప్రారంభమవుతుందని, ఇందుకు గాను 60వేల మెట్రిక్ టన్నులు అవసరముంటుందని పేర్కొన్నారు. 2023లో 30వేల మెట్రిక్ టన్నుల యూరియా రాగా 24,744మెట్రిక్ టన్నులు అమ్ముడు అయినట్లు తెలిపారు. 2024లో 27,595 మెట్రిక్ టన్నులు రాగా 19,738 మెట్రిక్ టన్నులు అమ్ముడుపోయిందని వెల్లడించారు. 2025కు సంబంధించి 30,623 మెట్రిక్ టన్నులు రాగా 28వేల మెట్రిక్ టన్నులు అమ్ముడు అయినట్లు వివరించారు. రబీ సీజన్‌కు కూడా యూరియా కొరత లేదని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 95శాతం కోతలు పూర్తయినట్లు పేర్కొన్నారు.

- తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆంధ్రజ్యోతి

'పింక్ డైమండ్' కథ కంచికి

- మైసూర్ మహారాజు సమర్పించిన హారంలో వున్నది రూబీ మాత్రమే
- సాక్ష్యాలతో నిరూపించిన ఆర్కియాలజిస్టు మునిరత్నం రెడ్డి



మైసూరు మహారాజు హారంపై వివాదం నేపథ్యంలో రూబీ అంటూ టీటీడీ విడుదల చేసిన ఫొటో



ఆభరణాలను మాజీ న్యాయమూర్తులు తనిఖీ చేస్తున్న సమయంలో తీసిన మైసూరు మహారాజు సమర్పించిన హారం ఫొటో

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పింక్ డైమండ్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. మైసూరు మహారాజు శ్రీవారికి సమర్పించిన హారంలో డైమండ్ లేదని, రూబీలు, కొన్ని రత్నాలు మాత్రమే అమర్చినట్టు కొన్ని సాక్ష్యాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో రాజకీయ విమర్శలతో పింక్ డైమండ్ వ్యవహారం పెద్దఎత్తున చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ప్రభుత్వాన్ని, టీటీడీని ఇబ్బందుల్లోకి నెట్టేలా అప్పట్లో వైసీపీ చేసిన ప్రచారం అసత్యమని తేల్చిచెప్పేలా కొన్ని ఆధారాలను ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి బయటపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

1945లో హారం బహూకరించిన మైసూరు మహారాజు

శ్రీవారికి విలువైన ఆభరణాలు బహూకరించిన రాజుల్లో మైసూరు మహారాజు జయచామరాజేంద్ర వడియార్ కూడా ఒకరు. 1945 జనవరి 9వ తేదీన ఆయన శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. మహారాజ పర్యటనకు సంబంధించి మైసూరు ప్యాలెస్ నుంచి 1944 డిసెంబరు 29వ తేదీన రామయ్య అనే ప్యాలెస్ అధికారి టీటీడీ కమిషనర్‌కు లేఖ రాశారు. రైలు ద్వారా 1945 జనవరి 9న ఉదయం 8 గంటలకు రేణిగుంటకు చేరుకునే మహారాజు తిరుపతి, శ్రీకాళహస్తి రాకపోకలకు రెండు మంచి కార్లను ఏర్పాటు చేసేందుకు సహకరించాలంటూ ఆ లేఖలో కోరారు. ఈ సందర్భంలోనే టూర్ షెడ్యూల్ కాపీని కూడా పంపారు.ఈ పర్యటనలోనే మైసూరు మహారాజు శ్రీవారికి హారాన్ని సమర్పించారు.ఆ హారాన్ని టీటీడీ కొన్నేళ్లుగా విశేష ఉత్సవాల సమయంలో ఉత్సవమూర్తులకు అలంకరిస్తోంది.2001 అక్టోబరు 21న జరిగిన గరుడసేవలో మలయప్పస్వామికి ఈ హారాన్ని అలంకరించారు. అయితే వాహనసేవను వీక్షిస్తున్న భక్తులు విసిరిన నాణేలు తగలడంతో ఆ ఆభరణంలో కెంపు రాయి విరిగిపోయింది. ఆ విషయాన్ని తిరువాభరణం రిజిస్టర్‌లో కూడా నమోదు చేశారు.



మైసూరు మహారాణి ప్రమోదదేవితో మునిరత్నంరెడ్డి

> స్వామివారి విషయాల్లో లేనిపోని అభాండాలు వేయకూడదు. తప్పుడు ప్రచారాలు చేస్తే మూల్యం చెల్లించాల్సిందే. మా పరిశోధనలో రాజు సమర్పించిన హారంలో డైమండ్ లేదని తేలింది. దేవాలయాల విషయాల్లో రాజకీయాలు చేయడం సరికాదు.
>
> - మునిరత్నం రెడ్డి

జెనీవాలో వేలం వేశారన్న రమణదీక్షితులు

మైసూరు మహారాజు శ్రీవారికి సమర్పించిన హారంలో ఉన్నది కెంపు రాయి కాదని, కోట్ల విలువైన పింక్ డైమండ్ అని, ఆ డైమండ్‌ను అపహరించి జెనీవాలో జరిగిన వేలంలో విక్రయించారంటూ 2018లో తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు రమణదీక్షితులు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అలాగే కైంకర్యాలు సరిగా జరగడం లేదని, నిధుల కోసం ఆలయంలో తవ్వకాలు నిర్వహించారని కూడా ఆయన ఆరోపణలు చేయగా టీటీడీ కూడా అదే స్థాయిలో స్పందించింది. రమణదీక్షితులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, ఈ విషయంపై జగన్నాధరావు కమిటీ ఇచ్చిన నివేదికలో పగిలిన కెంపు ముక్కలు పేష్కార్ ఆధీనంలో ఉన్నాయని తెలియజేసినట్టు వివరణ ఇచ్చింది.ఆ కెంపు విలువ రూ.50గా నిర్ధారించినట్టు రికార్డులున్నాయంటూ రమణదీక్షితుల ఆరోపణలను కొట్టిపడేసింది. అయితే స్వామికి అనేక ఏళ్ల దగ్గరుండి కైంకర్యాలు నిర్వహించిన రమణదీక్షితులు చెప్పడంతో పలువురు భక్తులు సందేహంలో పడ్డారు.

గతంలోనూ మాజీ న్యాయమూర్తుల తనిఖీలు

శ్రీవారి ఆభరణాల భద్రతపై గతంలో కూడా విమర్శలు వచ్చాయి. రాయల వారిచ్చిన ఆభరణాలతో పాటు మరికొన్ని ఆభరణాలు మాయమయ్యాయంటూ ఆరోపణలు రావడంతో 2009 సెప్టెంబరు నెలలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జగన్నాధరావు నేతృత్వంలో ఓ కమిటీ, 2010లో జస్టిస్ వాద్వా నేతృత్వంలో మరో కమిటీని ఏర్పాటు చేశారు.టీటీడీ విజిలెన్స్ విభాగం ఇచ్చిన నివేదికతో పాటు అధికారుల వద్దనున్న తిరువాభరణాల రిజిస్టర్‌ను వాద్వా కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి ఆభరణాలు సక్రమంగానే ఉన్నాయంటూ సంతృప్తి వ్యక్తం చేసింది. జగన్నాథరావు కమిటీ కూడా 1952 నుంచి ఉన్న రికార్డుల ప్రకారం ఏ ఆభరణం మిస్ కాలేదని నివేదికలో పేర్కొంది. కాగా ఆభరణాల భద్రత, వివరాలను పొందుపరచడంలో ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించింది. శ్రీకృష్ణదేవరాయలు సమర్పించిన కానుకల వివరాలు టీటీడీకి అప్పజెప్పినప్పటికీ తిరువాభరణాల లిస్ట్‌లో లేవని తేల్చిచెప్పారు.2001బ్రహోత్సవాల్లో పగిలింది కెంపు మాత్రమేనని, భక్తులు నాణేలు విసిరినప్పుడు అది విరిగిందని రమణదీక్షితులే గుర్తించినట్టు ఆ నివేదికలో ఉంది.కెంపు స్థానంలో వెంటనే ఓ పగడం కూడా తిరిగి అమర్చినట్టు కమిటీ వివరించింది.


వెలుగులోకి డైమండ్ కాదని సాక్ష్యాధారాలు

మైసూరు మహారాజు సమర్పించిన హారంలో పింక్ డైమండ్ అనేది లేదని పలు సాక్ష్యాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. మైసూరులోని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్(ఎపిగ్రఫీ) మునిరత్నం రెడ్డి ఈ అంశంపై కొద్దిరోజుల పాటు పరిశోధన చేశారు. మైసూరు మహారాణి ప్రమోద దేవిని కలవడంతో పాటు ప్యాలెస్‌లోని కొన్ని రికార్డులను పరిశీలించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో ఆ హారాన్ని రూ.8,500కు ఢిల్లీలో తయారు చేయించినట్టు తేలింది. ప్యాలెస్‌లోని ఆభరణాల రికార్డుల్లోనూ శ్రీవారికి సమర్పించిన హారంలో ఎలాంటి డైమండ్ ఉన్నట్టు లేదు. దీంతో గతంలో చేసిన విమర్శలు తాజా ఆధారాలతో అవాస్తవాలుగా తేలాయి.

రూ.200 కోట్లకు జరిమానా

భక్తుల మనోభావాలను దెబ్బతీయడంతో పాటు టీటీడీ ప్రతిష్టను దిగజార్చేలా వ్యాఖ్యలు చేసిన రమణదీక్షితులు, వైసీపీ అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డిపై రూ.200 కోట్ల పరువు నష్టం దావాను టీటీడీ వేసింది. దీనికి రూ.2 కోట్లు ఫీజు కూడా అప్పటి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం చెల్లించింది.వైసీపీ అధికారం లోకి వచ్చాక ఆ కేసును ఉపసంహరించుకోవడంతో కోర్టుకు చెల్లించిన రూ2 కోట్ల ఫీజు ఎవరిస్తారని, స్వామి నిధులు ఇలా దుబారా చేస్తారా అంటూ భారీగా విమర్శలొచ్చాయి. అయితే అంతకుముందు నానాయాగీ చేసి, భక్తుల్లో అనేక సందేహాలు రేకెత్తించిన వారంతా సమాధానమివ్వకుండా తేలుకుట్టిన దొంగల్లా మౌనంగా ఉండిపోయారు.





పుట్టినింట అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు - పూలతో అమ్మవారి ముఖాలంకరణ - అమ్మవారి ఆర్చి వద్ద భక్తుల కోసం క్యూలైన్

కదిలొచ్చిన పోలేరమ్మ

- వైభవంగా అమ్మవారి ఉత్సవ ఊరేగింపు
- భక్తుల దర్శనార్థం ఆలయం వద్ద నిలుపుదల
- నేటి వెంకటగిరి జాతరకు సర్వం సిద్ధం

వెంకటగిరి/వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుట్టిల్లయిన కుమ్మరి ఇంట బుధవారం రాత్రి రూపుదిద్దుకున్న పోలేరమ్మ ఊరేగింపుగా కదిలొచ్చారు. జాతర సందర్భంగా గురువారం భక్తులకు దర్శనం ఇవ్వడానికి ఆలయం వద్ద కొలువుదీరనున్నారు. వెంకటగిరి జాతరలో భాగంగా బుధవారం పోలేరమ్మ పుట్టినింట అమ్మవారి పీఠానికి దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి 7.30 గంటలకు పీఠంపై అమ్మవారి ప్రతిమను (కళ్లు, దిష్టి చుక్క లేకుండా) తయారు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పుట్టినింట కొలువుదీరిన అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో వేగంగా కదలాలంటూ పోలీసులు నెట్టగా భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అర్ధరాత్రి 12గంటలకు సప్పరంపై అమ్మవారిని అధిష్ఠింపచేసి అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలింటకు తీసుకొచ్చారు. ఇక్కడ ఆచార సంప్రదాయాలతో అమ్మవారికి కళ్లు, దిష్టి చుక్క ఏర్పాటు చేసి పూర్తి అలంకారం చేశారు. అక్కడ్నుంచి దివిటీల వెలుగుల్లో ఆసాదుల తప్పెట్లు, యువత చిందులు, కేరింతల నడుమ అమ్మవారి ఊరేగింపు మొదలైంది. ప్రతి ఇంటి ముంగిట అమ్మవారికి కోళ్లు, మేకలను బలిచ్చారు. దీంతో రోడ్లు ఎర్రగా మారాయి. గురువారం తెల్లవారుజామునకు ఆలయం వద్ద వేప మండలతో వేసిన మండపంలో అమ్మవారు కొలువుదీరనున్నారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ సందర్భంగా భక్తులు వేయి కళ్ల దుత్తలతో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. ఆ తర్వాత ట్రాక్టర్‌పై అమ్మవారిని ఊరేగింపుగా విరూప మండపానికి తీసుకెళ్లి ప్రతిమను ముక్కలు చేయడంతో జాతర ముగియనుంది.

చిన్నారుల మడి భిక్షాలు

'పోలేరమ్మకు మడిభిక్షం పెట్టండి. పోతురాజుకు టెంకాయ్ కొట్టండి. పగలక పోతే మానెత్తిన కొట్టండి' అంటూ వేపమండలు, పసుపు, కుంకుమలతో అలంకరించిన వెదురు బుట్టలు, స్టీలు గిన్నెలను చేత బట్టి ఇల్లిలూ తిరుగుతూ మొక్కుగా భిక్షాటన చేశారు. ఆ భిక్షాటన ద్వారా వచ్చే బియ్యంతో కుడుములు చేసి అమ్మవారికి నైవేద్యం పెడతారు.



జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

జాతర సందర్భంగా అమ్మవారి దేవస్థానం వద్ద పోలేమరమ్మను భక్తులు దర్శించుకొనేందుకు వీలుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను బుధవారం ఎస్పీ హర్షవర్ధనరాజు పరిశీలించారు. 8 మంది డీఎస్పీలు, 60 మంది సీఐలు, 110మంది ఎస్‌ఐలతో పాటు కానిస్టేబుల్, ప్రత్యేక దళాలు.. మొత్తంగా వెయ్యి మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్కిట్ కళాశాలలో అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనుబంధంగా పునఃప్రారంభమైన శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ దేవేంద్రరెడ్డి కోరారు. ఈ ఏడాది నుంచి జేఎన్‌టీయూ అనుబంధంగా ప్రారంభం కానున్న స్కిట్ కళాశాలలో రెండో దశ వెబ్ కౌన్సెలింగ్‌లో అడ్మిషన్ల ప్రక్రియ జరిగిందన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి మిగిలిన సీట్ల కోసం మూడో దశ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. వివరాల కోసం 98480 16733 నెంబరులో సంప్రదించాలని కోరారు.

స్వామి సేవకు రెండోసారి

- టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన అనిల్‌కుమార్ సింఘాల్



కాలినడకన వస్తున్న సింఘాల్

తిరుమల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర స్వామి సేవకు రెండోసారి టీటీడీ ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బాధ్యతలు స్వీకరించారు. టీటీడీ ఈవోగా, బోర్డు మెంబర్ సెక్రటరీ ఎక్స్ ఆఫిషియోగా బుధవారం ఉదయం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రెండోసారి ఈవోగా రావడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. 2017మే నుంచి 2020అక్టోబరు వరకు మూడేళ్ల నాలుగు నెలలు సేవలు అందించానని చెప్పారు. 1994నుంచి శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వస్తున్నానని చెప్పారు. ఈవోగా కాకుండా సామాన్య భక్తుడిగా క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్న సందర్భాలున్నాయన్నారు. బ్రహ్మోత్సవాల్లోని గరుడసేవను కూడా సామాన్యుడిగా దర్శించానని, తనకు సామాన్య భక్తుల ఇబ్బందులు తెలుసన్నారు. దేవాలయ పవిత్రతను కాపాడేందుకు, సాధారణ భక్తులకు న్యాయం చేసేందుకు టెక్నాలజీపై దృష్టి పెడతామన్నారు. టీటీడీ అధికారులు ఎంతో చిత్తశుద్ధితో రాత్రింబవళ్లు కృషి చేసి ఉత్సవాలను విజయవంతం చేస్తున్నారన్నారు.శ్రీవారి సేవకుల సేవలు మరింత విస్తరించే దిశగా ఆలోచనలు చేస్తున్నామన్నారు.భక్తుల సూచనలు స్వీకరించి టీటీడీ సేవలు మెరుగుపరుస్తామన్నారు.

కాలినడక, తలనీలాల సమర్పణ

ఈవోగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు అనిల్‌కుమార్ సింఘాల్ బుధవారం ఉదయం 5.05 గంటలకు అలిపిరి మార్గంలో కాలినడకను ప్రారంభించి 8 గంటలకు చేరుకున్నారు. మార్గంమధ్యలో కొందరి భక్తులతో మాట్లాడారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలు తెలుసుకోవడంతో పాటు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. ఎలాంటి విషయాల్లో చర్యలు తీసుకోవాలనే ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అనంతరం తిరుమలలో తలనీలాలు సమర్పించి ఆలయంలోకి వెళ్లారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఉనికి కోసమే వైసీపీ ఆరాటం: నెలవల


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓటు రూపంలో ప్రజలు బుద్ధి చెప్పినా వైసీపీలో మార్పు రాలేదని, ఎరువుల కొరత లేకపోయిన ఉనికి కోసం అన్నదాత పోరుబాట చేపట్టడం విడ్డూరంగా ఉందని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎరువుల కొరత పేరుతో పార్టీ నాయకులను వెనుకవేసుకుని నిరసన చేపట్టడం తగదన్నారు. జిల్లాలో అవసమైన మేరకు యూరియా అందుబాటులో ఉందన్నారు. కిలివేటి వ్యవసాయం గురించి తెలుసుకోవాలని, మన ప్రాంతంలో ఇంకా వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదని, అలాంటప్పుడు ఎరువుల కొరత ఎక్కడ వస్తుందన్నారు. వైసీపీకి నిజంగా రైతులపై ప్రేమ ఉంటే ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లి సమస్యలపై చర్చించాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, నాయకులు మాధవ నాయుడు, చిట్టేటి పెరుమాల్, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, రైతు సేవా సహకార సంఘ అధ్యక్షుడు ఏజీ కిషోర్, గాడి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం భారతి

గూడూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపయోగ పడే ఉపకరణాలను ప్రభుత్వం ఉచితంగా అందజేసేందుకు నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అసరమైన ఉపకరణాలను గుర్తించడం జరిగిందన్నారు. శిబిరంలో 120మంది విద్యార్థులు పాల్గొన్నారని, వీరికి త్వరలోనే ప్రభుత్వం ఉపకరణాలను అందజేసేలా చర్యలు చేపట్టిందన్నారు. ఈ శిబిరాన్ని డీవైఈవో సనత్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవోలు రవీంద్రబాబు, కాంచన, రఫూఫ్, వైద్యసిబ్బంది ప్రియ, శివకుమార్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల నిర్వహణ ఇలాగేనా: డీపీవో

పెళ్లకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం డీపీవో సుశీలాదేవి పర్యటించారు. శిరసనంబేడు గ్రామంలో చెత్త సేకరణ, ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య, ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకు, చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ శిరసనంబేడు, అనకవోలు పంచాయతీలో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యం, చెత్త సేకరణలో వెనుకబడడంపై సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు చెప్పారు. పంచాయతీలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ రాయభారం


ఈశ్వరుడు, దేవేంద్రుడి ఉత్సవమూర్తుల ఊరేగింపు

చిట్టమూరు, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాం శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణ రాయబారం వైభవంగా జరిగింది. బుధవారం తెల్లవారు జామున షణ్ముఖ స్వామి కల్యాణం నిర్వహించిన పండితులు మధ్యాహ్నం కల్యాణ రాయబారము కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. ఈశ్వరుడు, దేవేంద్రుల ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించారు. మల్లాం గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ రాయబార ఘట్టాలను ప్రదర్శించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సూపర్ హిట్ సభకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు


మంత్రి సవిత, మహిళా ఎమ్మెల్యేలతో నెలవల విజయశ్రీ

తడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం జరిగిన సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభకు తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో బెస్త కార్పొరేషన్ చైర్మన్ బోమ్మన శ్రీధర్, ఏఎంసీ డైరెక్టర్ ఏకాంబరం, టీడీపీ నాయకులు సెల్వం, పళణి, జయపాల్, సుధాకర్, తదితరులు బహిరంగసభకు తరలి వెళ్లారు. సభా ప్రాంగణంలో మంత్రి సవిత, మహిళా ఎమ్మెల్యేలు పరిటాల సునీత, భూమా అఖిలప్రియతో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సందడి చేశారు.

గ్యాస్ పైపులైన్ కోసం విచ్చలవిడిగా రోడ్ల తవ్వకాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో గ్యాస్ పైపులైన్ కోసం విచ్చలవిడిగా రోడ్లను తవ్వేస్తున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి శివకవి ముకుంద అన్నారు. బుధవారం పట్టణంలో రోడ్ల తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ప్రణాళికాబద్ధంగా గ్యాస్‌పైపు లైన్ అమర్చాల్సి ఉండగా, ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు చేపడుతున్నారని, ఇందువల్ల తాగునీటి పైపులైన్లు దెబ్బతింటున్నాయన్నారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడితే సరైన సమాధానం చెప్పలేదని,ఇ దీనిపై నిరసన కార్యక్రమం చేపడుతామన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మావుడూరు వెంకటాచలపతి అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. దేవదానం, భాస్కర్ రెడ్డి, బాలరాజు, గంగయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి తాళిబొట్టు బహూకరణ


ఆలయ చైర్మన్, ఈవోలకు తాళిబొట్టు అందజేస్తున్న దాతలు

వెంకటగిరి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతర సందర్భంగా పోలేరమ్మకు మొక్కు చెల్లింపులో భాగంగా అవ్వారు కృష్ణ దంపతులు 10గ్రాముల బంగారు తాళిబొట్టును అమ్మవారికి సమర్పించారు. బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, ఈవో శ్రీనివాసులురెడ్డికి తాళిబొట్టును అందజేశారు.

జాతరలో ఉచిత వైద్య శిబిరం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ జాతర సందర్భంగా తిరుపతికి చెందిన అమర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. బుధ, గురువారం రెండు రోజుల పాటు జాతరలో భక్తులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని ఎమ్మెల్యే చెప్పారు. అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు తోటా కృష్ణయ్య, టీడీపీ నాయకులు బీరం రాజేశ్వరావు, గల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌శక్తి సంకల్ప

చిల్లకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెట్టపల్లి, చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుకమ్మ మాట్లాడుతూ విద్యార్థినులకు వారి హక్కులు, మంచి స్పర్శ, చెడు స్పర్శ, స్వీయ సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జ్యోతి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది ఇంద్రావతి, కమలమ్మ, పెంచలమ్మ, సుజాత, ప్రసన్న, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

తడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో విద్యార్థులకు మండలస్థాయి ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో ఆటల పోటీలను ఎంపీడీవో శేఖర్‌నాయక్ ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్, యోగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవోలు వేములు, మల్లికార్జునరావు తెలిపారు.

రెవెన్యూ సహాయకుల సదస్సును విజయవంతం చేయండి

గూడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సదస్సును విజయవంతం చేయాలని వీఆర్‌ఏల సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు బుధవారం కోరారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 15న పట్టణంలో ప్రదర్శన నిర్వహించి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామన్నారు.

ఊనుగుంటపాళెంలో బేటీ బచావ్.. బేటీ పడావో

కోట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెం ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో బేటీ బచావ్ - బేటీ పడావో కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత, ఆశ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు బాల్య వివాహాల నిర్మూలన, కౌమారదశలో బాలికలకు వచ్చే మార్పులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు

వాకాడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని చైర్‌పర్సన్ మర్రి ప్రమీల స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఏఎంసీ ఆదాయం, ఖర్చులు, తదితర అంశాలపై ఇన్‌చార్జి కార్యదర్శి ప్రసాద్‌రెడ్డిని వివరణ కోరామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ దువ్వూరు మధుసూదనరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో వైద్య శిబిరం

నాయుడుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం శ్రీనివాసపురంలో జ్వరాలు ప్రబలుతుండటంతో బుధవారం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి శంకరయ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, గిరిజన కాలనీలో స్థానికులకు జ్వరాలు రావడంతో హెచ్‌ఎం చంద్రయ్య, టీడీపీ నాయకులు, న్యాయవాది పనబాక గంగరాజు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందించారు. బుధవారం వైద్యాధికారి శంకరయ్య వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది జాకీర్ హుస్సేన్, శివకుమారి, గోపాల్, మంజుల, సుకన్య, దీపిక, సుప్రజ, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్ర సర్వేను వేగవంతం చేయండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణిరెడ్డి

కోట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్ర సర్వేను మరింత వేగవంతం చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వాణిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పలు ప్రభుత్వ పథకాలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యో గులతో సమీక్షా సమావేశం జరిగింది. గ్రామాల్లో సర్వే చేసే ముందు ఆస్తి హక్కు కల్పించే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోపాలు జరిగితే సంబంధిత సర్వే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నం దున గ్రామాల్లో బ్లీచింగ్, పారిశుధ్యం, తాగునీటి పథకాలలో క్లోరినేషన్ కార్యక్ర మాలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వేణు, మండల సర్వేయర్ గోపీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరలో కట్టుదిట్టమైన భద్రత: ఎస్పీ


పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్నఎస్పీ హర్షవర్ధన్ రాజు

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు చెప్పారు. బుధవారం ఆయన స్థానిక పోలేరమ్మ గుడి, కుమ్మరి ఇళ్లు, సాకలి ఇళ్లు, రాజా వీధి, పాత బస్టాండ్ ప్రాంతాలను పరిశీలించారు. క్యూలైనులో భక్తుల మధ్య తోపులాట లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ కంట్రోల్ పాయింట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీవీఐపీలకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు, వారి వాహనాలు పార్కింగ్ గురించి సూచలు చేశారు. అమ్మవారి జాతరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వస్తున్నారని, వారికి బందోబస్తుతో అమ్మవారి దర్శనం కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహరాచారి, వెంకటగిరి సీఐ రమణ, ఎస్ఐలు పాల్గొన్నారు. అలాగే రాజాకుటుంబీకులు, ఏసీఏ మాజీ చైర్మన్ స్వర్ణ యాచేంద్ర జాతర ఏర్పాట్లు పరిశీలించారు. ఆర్చి సెంటర్, అమ్మవారి పుట్టినిల్లు, మెట్టినిల్లు, క్యూలైన్‌లను పరిశీలించారు. ఈవో శ్రీనివాసులు రెడ్డి, ఆలయ చైర్మన్ మురళీకృష్ణలకు సూచనలు చేశారు.

రైతు సేవా కేంద్రాలకు యూరియా


నెలబల్లి రైతు సేవా కేంద్రానికి యూరియా తీసుకొచ్చిన లారీ

దొరవారిసత్రం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాలకు టన్నుల కొద్దీ యూరియా సరఫరా అవుతోంది. ఇటీవల జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ మండలంలో పర్యటించిన సమయంలో వరి సాగు చేసే రైతులు ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు. రబీ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని నెలబల్లి రైతుసేవా కేంద్రానికి 52 టన్నుల యూరియా లారీల్లో వచ్చింది. దానిని స్థానిక గోదాములో నిల్వ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియాను అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

ఉపాధి కూలీల బకాయిల విడుదల

తడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఉపాధి కూలీల బకాయిలు మంజూరు అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది మే నెల 15నుంచి ఉపాధి కూలీల వేతనాలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. నాలుగు నెలలు అవుతున్నా పట్టించుకోలేదు. గత నెలరోజులుగా ఉపాధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం రూ.1668 కోట్ల బకాయిలను విడుదల చేసింది. బుధవారం నుంచి కూలీల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి. కాగా, తడ మండలంలో సుమారు రూ.3.33 కోట్ల బకాయిలు ఉండగా, దొరవారిసత్రంలో 1.65 కోట్లు, నాయుడుపేటలో రూ.2.37 కోట్లు, పెళ్లకూరులో రూ.94 లక్షలు, ఓజిలిలో రూ.2.10 కోట్లు, సూళ్లూరుపేట మండలంలో రూ.2.14 కోట్లతో కలిపి నియోజకవర్గంలో మొత్తం రూ.12.54 కోట్ల బకాయిలు ఉన్నాయి.

విశ్వనాథ సత్యనారాయణ జయంతి


విశ్వనాథ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చిల్లకూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్ల వారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ అవార్డును అందుకున్న విశ్వనాథ సత్యనారాయణ ఎన్నో నవలలు, గ్రంథాలు రచించి తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనసూయ, ప్రజేంద్రరెడ్డి, లీల, నాగభూషణమ్మ, రవీంద్ర, వసుంధర, చిన్నారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో నుంచి ప్రయాణికులను దింపేసిన ఘటనపై విచారణ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి రాయదొరువుకు వెళ్లే బస్సులో నుంచి విశ్రాంత షార్ ఉద్యోగుల కుటుంబ సభ్యులను కండక్టర్ మార్గమధ్యంలో దింపేసిన ఘటనపై బుధవారం డిపో అధికారులు విచారణ చేపట్టారు. బాధితుల సమాచారం మేరకు.... ఈ నెల 1న విశ్రాంత షార్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు తులసి, సాయి శ్రీహరికోటకు వెళ్లేందుకు సూళ్లూరుపేట నుంచి రాయదొరువు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఎంతసేపటికీ కండక్టర్ టికెట్ కొట్టేందుకు రాకపోవడంతో కుదిరి స్టేజ్ దాటిన తరువాత అడిగారు. స్టేజీ దాటినా ఎందుకు టికెట్ తీసుకోలేదని కండక్టర్ ప్రశ్నించాడు. టికెట్ కొట్టేందుకు మీరెందుకు రాలేదని కండక్టర్‌ను ప్రయాణికులు అడగడంతో మార్గమధ్యంలో అటవీ ప్రాంతంలో బస్సును ఆపి తులసి, సాయిలను దింపేశారు. ఈ విషయం తెలుసుకున్న వారి బంధువులు అక్కడకు చేరుకుని ఆర్‌ఎంకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారించాలని డిపో అధికారులకు ఆర్‌ఎం ఆదేశించారు. బుధవారం ఆర్టీసీ సూపర్‌వైజర్ సురేష్ ఆ ప్రాంతానికి వెళ్లి బాధితులను కలిసి జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు.





శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీ నిర్మాత అంబికా కృష్ణ, నటుడు శ్రీరామ్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

భక్తులకు మెరుగైన సేవలపై ప్రత్యేక దృష్టి

● అధికారులకు ఈవో సింఘాల్ సూచన

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత సేవా దృక్పథంతో, మరింత బాధ్యతగా సేవలను అందిద్దామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్నమయ్య భవనంలో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు సూచనల మేరకు శ్రీవారి సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఛైర్మన్, సభ్యులు, దయల్ యువర్ ఈవో, ఐవీఆర్ఎస్ తదితర మార్గాల ద్వారా భక్తుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. వీలైనంతవరకు టెక్నాలజీ సాయంతో మెరుగైన సేవలు కల్పించాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు నాణ్యతగా ఉన్నట్టు భక్తులు చెప్పారన్నారు. విధానపరమైన నిర్ణయాల్లో ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమష్టిగా నిర్ణయం తీసుకుని వేగంగా సేవలు అందిద్దామన్నారు. అంతకుముందు వివిధ విభాగాల అధికారులు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఈవోకు వివరించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.07 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,828

తలనీలాలు సమర్పించినవారు: 26,296



ఇక డీలర్ల వద్ద నో వెయిటింగ్

● ఇప్పటికే ప్రజలకు స్మార్టు కార్డుల పంపిణీ

● డీలర్లకు ఈ-పోస్ మిషన్ల అందజేతకు ఏర్పాట్లు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో అవినీతి అక్రమాలకు చెక్ పెట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ఇప్పటికే తొలి విడతలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిన అధికారులు తాజాగా ఆధునిక ఈ-పోస్ పరికరాలను అందజేయాలని నిర్ణయించింది. పాత మిషన్లలో రేషన్ కార్డు నంబరు నమోదు చేశాక కార్డుదారుని వేలి ముద్ర తీసుకునేవారు. దీనివల్ల పని ఆలస్యమయ్యేది. కార్డుదారులు ఇబ్బందిపడేవారు. ఇప్పుడు స్మార్ట్ కార్డుల్లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా,స్వైపింగ్ చేసినా డీలర్ల పని సులభమవుతోంది. వెంటనే కార్డులోని కుటుంబ సభ్యుల వివరాలు కనిపిస్తున్నాయి. ఈ-పోస్ పరికరం కూడా మొబైల్ ఫోన్‌లా పనిచేస్తుంది. ఇందులో సిమ్ కార్డు పెట్టి రీచార్జి చేస్తారు. తక్కువ బరువు ఉండడం వల్ల ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్ళవచ్చునని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు ఆంధ్రజ్యోతికి చెప్పారు. అంగన్ వాడీ కేంద్రాలకు అందచేస్తున్న సరకుల వివరాలు, డీలర్ల వద్ద నిల్వలు తదితర వివరాలు క్షణాల్లో తెలుసుకోవచ్చన్నారు.

వచ్చే అక్టోబరు రెండు నుంచి పూర్తి స్థాయిలో..

అక్టోబరు రెండు నుంచి పూర్తి స్థాయిలో రేషన్ దుకాణాల డీలర్లకు ఈ-పోస్ పరికరాలను పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాకు దాదాపు 1457 మిషన్లు వచ్చాయి. వీటిని డీలర్లకు అందచేసి వచ్చే నెల మొదటి వారం నుంచి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వంద మంది డీలర్లకు వీటిని అందచేశారు. సర్వర్, పరికరాల ద్వారా సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు జాగ్రత్తలు పడుతున్నారు.



యువకుడి దారుణహత్య


రహీద్‌బాషా(ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం ఓ యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న రహీద్‌బాషా అలియాస్ మున్నా(35) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం స్థానిక గాంధీనగర్ సమీపంలోని శ్మశానం వద్ద రహీద్‌బాషా రక్తపు మడుగులో పడి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ గీతాకుమారి సీఐలు శ్రీనివాస్, శేఖర్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రంపించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట రహీద్‌బాషా బంధువులు ఆందోళన చేపట్టారు. హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మృతుడి బంధువులకు, పోలీసులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు నచ్చచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

మహిళా సాధికారత సదస్సు ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 14, 15న జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. హోటల్ తాజ్, గ్రాండ్ రిడ్జ్, హోటల్ సరోవర్‌లో అతిథుల బస కు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. సదస్సు నోడల్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్, తుడా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆమె సూచించారు. జిల్లా పంచాయితీ అధికారి వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, తుడా ఈ.ఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్‌లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతు మాధవ్, రవి, మేనేజర్ హసీమ్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.

రేపు టూరిజం ఇన్వెస్టర్స్ మీట్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని తాజ్ హోటల్‌లో శుక్రవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ టూరిజం ఇన్వెస్టర్స్ మీట్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ ఆధ్వర్యంలో జరిగే ఈ మీట్‌లో రాష్ట్రంలో పర్యాటక రంగం బలోపేతం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా చర్చలు జరుపుతారని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించే రోడ్ మ్యాప్ రూపొందించనున్నట్లు తెలిపారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు, అనంతపురం, సత్యసాయి, కర్నూలు జిల్లాల నుంచి స్టేక్ హోల్డర్స్ పాల్గొంటారని వెల్లడించారు.

వందశాతం లక్ష్యసాధనకు కృషి చేయాలి


కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వందశాతం లక్ష్యసాధనకు వైద్యాధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో తక్కువ ప్రగతి సాధించిన కేంద్రాల వైద్యాధికారుల నుంచి కారణాలు తెలుసుకుని అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. జననాల సంఖ్య పెంపు, టీకాలు పూర్తిచేయడం, మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధన జరిగేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, వైద్యాధికారులు శైలజ, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, శాంతకుమారి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్వాంటం వ్యాలీ హ్యాకథాన్‌లో పాల్గొనడం గొప్ప అవకాశం

- పద్మావతి వర్సిటీలో అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్ -


విజేతలతో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్‌లో పాల్గొనడం విద్యార్థులకు మంచి అవకాశమని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీలో బుధవారం చేపట్టిన అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవాలని కోరారు. క్వాంటం కంప్యూటింగ్‌కు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు ఉన్నాయన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పరిశ్రమలు-విద్యాసంస్థల భాగస్వామ్యంతో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా సాంకేతికత ఆధారంగా సామాజిక సమస్యల పరిష్కారంపై చేపట్టిన పోటీల్లో విజేతలకు కలెక్టర్ వెంకటేశ్వర్, వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, డీన్ వాణి, ఉన్నత విద్యామండలి ప్రతినిధి రోశయ్య, టీటీఐ సీఈవో సూర్యకుమార్ నగదు బహుమతులు అందజేశారు.

చెరువుల అభివృద్ధికి శ్రీకారం

● మరమ్మతులకు రూ.515 కోట్లతో ప్రతిపాదనలు


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 181 చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ, పునర్నిర్మాణం కోసం రూ.515.18 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం చెరువుల పునరుద్ధరణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 181 చెరువులను బాగుచేయడం ద్వారా 30,08,185 హెక్టార్ల ఆయకట్టుకు ప్రయోజనం లభించనుందని తెలిపారు. 33 కరువు ప్రభావిత మండలాలు లబ్ధి పొందనున్నాయన్నారు. స్లూయిజ్‌లు, సరఫరా చానల్స్ మరమ్మతులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు రాధాకృష్ణ, వెంకటేశ్వరరావు, దేశీనాయక్, వెంకటేశ్వరప్రసాద్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

మద్యం తాగి విధులకు వాచ్‌మెన్

● కొందరు విద్యార్థులతోనూ తాగించిన వైనం?

● బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో కలకలం

తిరుపతిరూరల్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తామే కాకుండా కొందరు విద్యార్థులతోనూ ఇద్దరు వాచ్‌మెన్లు మద్యం తాగించిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రుల తెలిపిన వివరాలిలా.. తిరుపతి రూరల్ తాటితోపు వద్ద జ్యోతిబాఫూలే బీసీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ఉంది. 5-10తరగతులకు చెందిన 230మంది ఇందులో చదువుతున్నారు. ఇక్కడి ఇద్దరు వాచ్‌మెన్లు సాయంత్రం పూట మద్యం తాగి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల దీనిని కొందరు విద్యార్థులు గమనించారు. దీంతో ప్రిన్సిపాల్, టీచర్లకు ఫిర్యాదు చేయవద్దంటూ బెదిరించి వారితోనూ మద్యం మద్యం తాగించారని సమాచారం. విద్యార్థులు తర్వాత ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. వాచ్‌మెన్ల వ్యవహార శైలిపై గతంలోనూ చేసినా ప్రిన్సిపాల్, టీచర్లు పట్టీపట్టనట్టు వ్యవహరించారని తల్లిదండ్రులు ఆరోపించారు. కాగా వాచ్‌మెన్లను ప్రిన్సిపాల్ పిలిచి మందలించి మొదటి తప్పుగా వదిలేశారని సమాచారం. ప్రిన్సిపాల్ గిరిధర్‌ని వివరణ కోరగా..పాఠశాలలో మద్యం బాటిళ్లు ఉంటే బయటపడేసి వాచ్‌మెన్లను మందలించామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. విచారణ జరుగుతుందని వివరించారు.

నేడు కేంద్ర ఆర్థిక మంత్రి రాక

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మూడు రోజుల పర్యటన నిమిత్తం గురువారం తిరుపతికి రానున్నారు. మధ్యాహ్నం 2గంటలకు హైదరాబాద్ నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడ బస చేసి, శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు.శనివారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

ఆహార భద్రతపై పారిశ్రామికవేత్తలకు శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

మంగళం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతపై బుధవారం తిరుపతిలోని టీటీడీసీ సమావేశ మందిరంలో పారిశ్రామికవేత్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆహార పదార్థాలు తయారు చేయడంలో ఉపయోగించాల్సిన ముడి పదార్థాలను గుర్తించడం, వాటిని ఉపయోగించడంపై చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు చెందిన 120మంది మహిళా పారిశ్రామికవేత్తలు శిక్షణ పొంది సర్టిఫికెట్లు అందుకున్నారు. కుప్పం నుంచి అత్యధికంగా 20మంది మహిళా పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు మాట్లాడుతూ ఆహార ఆధారిత పరిశ్రమలకు మిల్లెట్స్ ఫుడ్ ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యారిస్ హౌస్ ట్రస్టు సభ్యురాలు శిరీష, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

13న బాక్సింగ్ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని జీడీపీ హైస్కూల్లో ఈ నెల 13న జిల్లాస్థాయి అండర్ 14 బాలురు, అండర్ 17, 19 బాలికల బాక్సింగ్, బైరాగిపట్టెడ ప్రైవేటు క్రీడా ప్రాంగణంలో లాన్‌టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న వారు అర్హులని, ఆసక్తిగల బాలబాలికలు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని పేర్కొన్నారు. హెచ్‌ఎం నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కులిస్టుతో రావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9849159147, 9441891874 (బాక్సింగ్), 9700778867 (లాన్‌టెన్నిస్)లను సంప్రదించాలని కోరారు.




కింద చోటు లేదు.. అందుకే ఇంతెత్తుకు..!

అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.


మూడు జెండాలు.. మురిపించిన నేతలు




పవనిజం..

యువతరం ఉత్సాహం..